# సిటీ లైట్స్

కంఠమనేని రాధాకృష్ణమూర్తి



శ్రీ
కౌముది
మీ ముంగిళ్లలో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 27

# ఇందులో...


| | |
|---|---|
| ఆఫీసరు గారి పెళ్ళాం అలిగింది | 3 |
| న్యాయం పవిత్రమైనది | 6 |
| చిన్నమ్మా వీళ్ళమీద కోపగించకు | 11 |
| బటర్ ఫ్లై..బటర్ ఫ్లై..నీలోని బటరెంత? | 16 |
| అమ్మాయిలూ జాగ్రత్త | 20 |
| తోడేలు దుమికిన వేళ | 23 |
| నీకంటే నెత్తురు పల్చన | 27 |
| నానాటి బ్రతుకు నాటకం | 31 |
| మాన్ ఆఫ్ కాన్షెన్స్ | 34 |
| డాక్టరు కంటే దర్జీ మేలు | 38 |
| డెర్రెబ్రో | 42 |
| వానిటీ పర్ప్లెక్స్‌డ్ | 47 |

# ఆఫీసరుగారి పెళ్ళాం అలిగింది

**గాజుల** గలగలలు, పట్టు చీరల గరగరలు, మీననేత్రాలు, వాటి తళతళలు, నునుపాటి చెంపలు, ఆ బాపతు మెరుపులు, రంగు రంగుల చీరలు, సుతారంగా కదిలే కుచ్చెళ్ళు, కోమలమైన స్వరాలు, స్వతాహా తడిగా ఉండి తమలపాకుల్లా పల్చగా మృదువుగా ఉన్న పెదిమలు, కృత్రిమంగా రంగులు పూసుకుని బండగా మొద్దుగా ఉన్న పెదాలు, లేడి చూపులు, యావ చూపులు, క్రూరచూపులు, బడాయి చూపులు...

ఆరోజు ఆడవాళ్ళకి పండగ.

అదంతా ఆడవాతావరణం.

అదొక క్లబ్బు - లేడీస్ క్లబ్.

అక్కడంతా కలకలం, కోలాహలం, కదన కుతూహలం.

వాళ్ళలో ఒకామె -

బొద్దుగా, భారీగా ఉంది. చీరలో ఆడంబరం, చూపుల్లో ఆడంబరం, పొట్ట భారీగా, ఆపైన భారంగా ఆ క్రింద భారంగా, ఆ మొత్తం ఓ బానలా - ఆ బానమీద తలకాయ - తలకాయ నిండా బడాయి, మూర్ఖత్వం, మొండితనం, అహంభావమూ, ఆవకాయా, మట్టిసుద్దా, చెత్తచెదారమూ - అంతా కలగాపులగమూ, కన్ఫ్యూజనూ - ఆమె మెదడూ శరీరమూ కూడా మొద్దుబారిపోయిన పదార్థాలు, వ్యర్థపదార్థాలు, వేస్టు సరుకు -

ఆమె పేరు వర్ధనమ్మ. ఒక పెద్ద ఆఫీసరుకు భార్యామణి. అతగాడికి ఆమె మొగుడూ, యజమానీ, చక్రవర్తిణి, చక్ర పొంతలీ -

మరొకామె ఉంది.

ఆమె చూడండి ఎంత చక్కగా ఉందో - సన్నగా, సుతారంగా, నిరాడంబరంగా, నేత చీరలో పుత్తడిబొమ్మలా, స్వచ్ఛంగా, చక్కెరకేళీలా, చద్ది అన్నంలా ఆరోగ్యంగా, అందంగా, సౌమ్యంగా, సుమధురంగా, సుమతీశతకంలా - నవ్వుతుంటే ఆలయం బయట గాలి గంటలు మోగుతున్నట్లు, మాట్లాడుతుంటే ఎవరో గుసగుసలాడుతున్నట్లు - నాజూకుగా, అలవోకగా, నునువుగా, మృదువుగా, మధురంగా, మధురంగా...

ఈమె పేరు లలిత!

లలిత బాగా చదువుకుంది. ఆమె బుర్రలో విజ్ఞానం ఉంది. వివేచన ఉంది. భర్త ఉన్నాడు. అతడో చిరుద్యోగి. ఆమె నెంతో ప్రేమిస్తాడతను. అతడినెంతో ప్రేమిస్తోందామె. వాళ్ళది ఆదర్శ దాంపత్యం. అద్భుతమైన అనురాగం, అనూహ్యమైన అన్యోన్యం. వాళ్ళు ఐడియల్ కపుల్.

ఆ క్లబ్బులో ఆ సమయాన ఇంకా చాలామంది ఉన్నారు గానీ మనకి కావాల్సిన వాళ్ళు మాత్రం వీళ్ళిద్దరే ప్రస్తుతానికి -

లలిత ఈ మధ్యనే చేరింది క్లబ్బులో.

ఆరోజు వర్ధనమ్మ వచ్చేసరికి లలిత లైఫ్ మాగజైను తిరగేస్తూ కూర్చుంది. ఆమెకెదురుగా కూర్చుని వర్ధనమ్మ కొద్దిసేపు మిగతా మాగజైన్లు తిరగేసింది. అప్పటికి ఆమె ఇంకా ఆ లైఫ్ మాగజైన్ని చూడలేదు. అందుకని ఒకటి, రెండుసార్లు లలిత చేతిలోని మాగజైన్ వైపు చూసింది. క్లబ్బులోని మిగతా మెంబర్లు ఎవరైనా అయితే ఈపాటికి ఆమెకా మాగజైన్ని ఇచ్చేసి తాము వేరే మాగజైన్ తీసుకుని ఉండేవాళ్ళు.. కాని లలిత అందరిలాంటిది కాదు. వర్ధనమ్మను గమనించి కూడా ఆమె పెద్దగా లెక్కచేయకుండా పేజీలు త్రిప్పసాగింది.

"చూడమ్మాయ్, ఒకసారి లైఫ్ ఇస్తావా?"

దృష్టి మరల్చి ఒకసారి వర్ధనమ్మవేపు చూసింది లలిత.

"నేను చదువుతున్నానండీ, చదవడం పూర్తయ్యాక ఇస్తాను"

వర్ధనమ్మకు ఇంతవరకూ అక్కడ అలాంటి సమాధానం ఇచ్చిన వాళ్ళు లేరు. అవును మరి, అందరి మొగుళ్ళకి ఆమె మొగుడు పెద్దాతి పెద్ద ఆఫీసరు

వర్ధనమ్మ కళ్ళు ఎర్రబడ్డాయి. కోపంగా తలపంకించి ఆమె అక్కడినుంచీ లేచిపోయింది.

కాలేజీ రోజుల్లో చాలా యాక్టివ్‌గా ఉండేది లలిత. పరిపూర్ణవ్యక్తిత్వం ఆమెది. "మనిషికి" ఏమి వున్నది అన్నదాన్ని బట్టిగాక "మనిషిలో ఏమున్నద"న్న దానికి విలువ ఇవ్వాలంటుందామె. తన పట్ల తనకు ప్రగాఢ విశ్వాసం ఉంది. ఎవరినీ లెక్క చేయదు. ఆ తత్వాన్ని చూసే ఆమె భర్త ఆమెను కోరి కట్టుకున్నాడు.

కొద్దిసేపున్నాక లలిత లేచి నిలబడింది.

అవతల కొందరు కారమ్స్ ఆడుతూంటే అక్కడికి నడిచింది.

ఆ ఆడేవాళ్ళలో వర్ధనమ్మ కూడా ఉంది. ఆ ఆడేవాళ్ళందరిలో ఆమెదే పైచేయిగా ఉంది. మిగతావారు ఆమె ధాటికి తట్టుకోలేకపోతున్నారు.

"మీతో ఆడటం మావల్ల కాదు మేడమ్" వాళ్ళలో ఒకావిడ అన్నది.

కులుక్కుంటూ సగర్వంగా చూసింది వర్ధనమ్మ. తలెత్తి పైకి చూసిన ఆమెకు నవ్వుతూ నిలబడి తమ ఆటను గమనిస్తున్న లలిత కనిపించింది.

"నువ్వు ఆడతావా అమ్మాయ్?" అన్నదామె. ఆ పిల్లను ఎలాగైనా దెబ్బతీయాలని ఆమె లోలోపల మహా ఉబలాటంగా ఉంది.

ఆడతానన్నట్లు తల ఊపింది లలిత.

"ఆ పిల్ల ఆడుతుందట నువ్వు తప్పుకోవే రాణి."

రాణి అన్న అమ్మాయి లేచి నిలబడితే ఆ స్థానంలో లలిత కూర్చుంది.

ఇద్దరూ ముఖాముఖీ ఎదురుక్కున్నారు.

చాలా త్వరలోనే ఆట అయిపోయింది. వర్ధనమ్మ చిత్తుగా ఓడిపోయింది.

ఎడమ గుప్పిటిని ముడిచి బ్రొటనవ్రేలును పైకి లేపి థమ్సప్ ధోరణిలో లలిత విజయ సూచకంగా తన చేతిని అలవోకగా పైకిలేపి ఆడించింది.

ఆ జెశ్చర్ చేస్తున్నప్పుడు ఆ పిల్ల అద్భుతమైన అందంతో భాసించింది.

నల్లగా అయిపోయింది వర్ధనమ్మ మొహం.

"నీపేరేమిటమ్మాయ్?"

"లలిత"!"

అండీ అనన్నా అనటంలేదు ఎంత పొగరు?

లలితకు మొదటినుంచీ ఆమె మొహంలోని అహంభావాన్ని చూస్తుంటే అంత గౌరవం ఇవ్వాలనిపించటంలేదు.

ఆ తరువాత ఏవో రాజకీయాల సంభాషణ వచ్చింది. వర్ధనమ్మ చేసే అడ్డమైన అసందర్భ అసమంజస వాదనలన్నిటికీ మిగతా వాళ్ళెవరూ ఎదురు చెప్పకపోవటం లలితకు చిరాకు అనిపించి ఆ సంభాషణలో పాలు పంచుకుంది.

లలిత రీజనింగ్‌కి ఆమె తట్టుకోలేకపోయింది.

"చూడమ్మాయ్, పెద్దవాళ్ళకు అలా ఎదురు చెప్పటం మంచి లక్షణం కాదు."

"ఇందులో ఎదురు చెప్పేదేముందండీ, ఎవరి అభిప్రాయాల్ని వాళ్ళు వ్యక్తం చేస్తున్నాము అంతే కదా!"

"ఏమయినా అవతలి వాళ్ళను కొంచెం చూసి మాట్లాడటం మంచిది."

ఈ మాటలు అన్నామెవేపు కొద్దిసేపు బ్లాంక్‌గా చూసింది లలిత. తర్వాత తనలో తను అనుకుంటున్నట్లుగా పైకే అన్నది పెద్దగా -

"స్నూన్!"

ఉలిక్కిపడ్డారు అక్కడి వాళ్ళంతా. ఒక్క క్షణం సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది.

అక్కడ ఉన్న వాళ్ళందరికీ లోలోపల సంతోషంగానే ఉంది. వాళ్ళంతా అంతకుముందు ఏదో ఓ సమయంలో వర్ధనమ్మ తృణీకారాన్ని రుచి చూసినవారే. లోలోపల కోపం కలిగినా ఎవరూ ప్రదర్శించలేకపోయారు. ఇన్నాళ్ళకి లలిత కనిపించింది. ఆమెను చిత్తు చేస్తోన్న స్త్రీ!

"చూడమ్మాయ్ నువ్వు మరీ పొగరుమోతుగా మాట్లాడుతున్నావు గానీ మీ ఆయన ఏం చేస్తుంటాడు? ఏ ఆఫీసులో పని చేస్తున్నాడు??" అన్నది వర్ధనమ్మ కోపంగా.

ఆమె "బిలోదిబెల్ట్" దెబ్బతీయాలని చూస్తోందని అర్థమయింది లలితకు.

"మన "ఆయనల" విషయం ఇక్కడెందుకండీ, మనం మనంగా రాణించటం బాగుంటుంది గానీ భర్తల గొప్పతనాలు చెప్పుకుంటూ ఎన్నాళ్ళు బ్రతుకుతాం? శరీరాల మీద ఉండే గజ్జిని అందమైన బట్టల వెనక దాచుకుంటున్నట్లు ఉంటుంది తప్ప?"

మరోసారి నిశ్శబ్దం ఆవరించింది అక్కడ.

అంతా ఊపిరి బిగబట్టి చూడసాగారు. ఏమి జరుగబోతోంది? దీన్ని వర్ధనమ్మగారు ఎలా తట్టుకుంటుంది? అక్కడికక్కడ లలిత పీక పట్టుకుని నులుమేస్తుందా? లలిత రెండు కాళ్ళూ చేతబట్టుకుని గిరగిరా గిరగిరా తిప్పి సప్త సముద్రాల ఆవలకు విసిరి వేస్తుందా వాలి రావణాసురుడి దేహాన్ని విసిరేసినట్లున...

వారం రోజులు గడిచాయి. ఆ రోజు చక్రవర్తి మామూలుగానే ఇంటికి వచ్చాడు. ఎప్పటిలా భార్యను వాటేసుకుని గిరగిరా తిప్పి పెదిమల మీద ముద్దుపెట్టుకున్నాడు.

"ఏమిటీ అలా ఉన్నారు?" అతని చొక్కా గుండీలను విప్పుతూ అడిగింది లలిత.

జేబులోంచి ఒక కాగితాన్ని తీసి చూపించాడతను. అది ట్రాన్స్ఫర్ ఆర్డరు కాగితం. ఒకమారుమూల గ్రామానికి అతనికి బదిలీ అయింది.

"ఇదేమిటి, ఈ మధ్యే కదా మనం ఇక్కడికి ట్రాన్స్ఫరయ్యాం?" ఆశ్చర్యంగా అడిగింది లలిత.

"మా పై ఆఫీసరు పెళ్ళాం అలిగిందట."

"అదెవరు?"

"మీ క్లబ్బు సెక్రటరీ వర్ధనమ్మ!"

"అమ్మ ముసలావిడ..!!" అప్రయత్నంగా అన్నది లలిత.

"ఆఫీసర్లు వాళ్ళ క్రింద వాళ్ళను పాలిస్తుంటే వాళ్ళను వాళ్ళ భార్యలు పాలిస్తుంటారు లలితా" నవ్వడానికి ప్రయత్నించాడు చక్రవర్తి.

కొద్దిసేపు ఆగి అతను మళ్ళీ అన్నాడు.

"ఈ ఆఫీసర్లు చదివే చదువును చూచి యవ్వనంలో వాళ్ళను వాళ్ళకంటే పై అంతస్తు పిల్లలనిచ్చి పెళ్ళి చేస్తారు. తమకంటే పై అంతస్తు నుంచీ వచ్చే ఈ భార్యలతో తూగలేక వీళ్ళు తమ న్యూనతలను చంపుకోవటానికీ, మామల అంతస్తు కెగబ్రాకి భార్యల మెప్పులు సంపాదించటానికీ పైవాళ్ళ అడుగులు మొక్కి ప్రమోషన్లు సంపాదించటాలు, ఆయా న్యూనతల్ని కప్పిపుచ్చుకోవటానికి కింద వాళ్ళను సతాయించటాలు ఇలాంటి ట్రాన్స్ఫర్లు, మామీద చికాకులూ.."

లలిత కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నామీద కోపంగా ఉందా?" అన్నది.

"లేదు" ఆమె కళ్ళమీద ముద్దు పెట్టుకున్నాడతను.

****

# న్యాయం పవిత్రమైనది

గోడ దూకాడు రామారావు. కాలేజీ రోజుల్లోని ఆటల ప్రావీణ్యం అతనికిప్పుడు ఉపకరించింది. వీధివేపు అంతా చీకటిగా ఉన్నా పెరటిలో మాత్రం వెలుతురు బాగానే ఉంది వరండా బయట వెలుగుతున్న బల్బుద్వారా. ఆ మూల గుబురుగా ఉన్న సన్నజాజి పొద వెనక కొద్దిపాటి మసకతనం ఉంటే చప్పున అటు నడిచాడు.

ఎక్కడా అలికిడి లేదు. వరండా అవతలగా తెరచి ఉన్న గుమ్మంలోంచి డైనింగుటేబులు మీద స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు, బోర్లించిన పళ్ళాలు, వాటర్ జగ్, గ్లాసులు మొదలైనవి కనిపిస్తున్నాయి.

పొద వెనక నిలబడి ఉన్న రామారావు గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. అతని కళ్ళనిండా భయం. కాళ్ళలో నిస్త్రాణత. రెండు రోజుల క్రితం చేసిన భోజనం కావటంతో అతనికి తన శరీరమే భారంగా అనిపిస్తోంది.

దొంగతనం చేయటానికి వచ్చాడు అతనిప్పుడు.

డబ్బు తస్కరిద్దామని కాదు. విలువైన ఆభరణాల కోసమూ కాదు. కేవలం తిండిని దొంగలించుకుందామని!

రెండు రోజులనుంచీ పస్తులుంటున్న భార్యాబిడ్డల ఆకలి తీర్చటం కోసం...

న్యాయమైన రీతిలో ఆపని చేయటానికి అవకాశాలు లేక, చాతకాక, అన్యాయంగానైనా సరే సంపాదించుదామని!!

మధ్య తరగతి మనుషులు అతి హేయంగా భావించే చోరత్వానికి అయిష్టంగా, దిగులు దిగులుగా, భయం భయంగా...

కొద్దిసేపు తర్వాత గుండె దిటవు పరచుకుని రామారావు మొండి ధైర్యంతో ముందుకు కదలబోయి చటుక్కున ఆగిపోయాడు. లోపలి గదిలోంచి ఒక యువతి వరండాలోకి వస్తోంది. స్లీవ్‌లెస్ జాకెట్ ధరించి ఉందామె. ఆరోగ్యంతో

ఆమె శరీరం నవనవలాడుతూ కనిపిస్తోంది. ఖరీదైన యాపిల్‌పండులా ఉందామె. ఆమె వెనకే మరో యువకుడు ఉన్నాడు. అందంలోనూ, ఆరోగ్యంగానూ అతనామెతో పోటీ పడుతున్నాడు.

వాళ్ళిద్దరూ తననెక్కడ గమనిస్తారోనని భయపడ్డాడు రామారావు. కానీ వాళ్ళ గొడవలో వాళ్ళున్నారు.

"ఇన్నాళ్ళా మీరు కాంపుకు పోయి ఉండి వచ్చేది?" అంటోందామె.

"ఏం చేయను డియర్ ..." ఏమో అంటూ అతనామెను డైనింగ్ టేబుల్ వద్దకు నడిపించుకు పోయాడు.

వాళ్ళిద్దరూ టేబులుకు అటువేపున పక్కపక్కనే కుర్చీల్లో కూర్చున్నారు, రామారావుకు అభిముఖంగా.

ఇబ్బందిగా కదిలి మరింత వొదిగి నిలబడ్డాడు రామారావు. తన మొహం మీద వెల్తురు పడకుండా జాగ్రత్త పడుతూ.

గిన్నెమీద మూత తీసిందామె. రెండు ప్లేట్లలో తనకూ అతనికీ ఏమో వడ్డించింది గరిటతో.

గుటకలు మింగాడు రామారావు.

వాళ్ళిద్దరూ నెమరేస్తున్నారు. ఒకరి నోటికొకరు అందించుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా చూసుకుంటున్నారు.

ముచ్చటేసింది రామరావుకు వాళ్ళను చూస్తుంటే. ఆ సమయాన తన భార్య గుర్తుకు వచ్చింది. ఎండిపోయి పీలగా ఉంటుందామె. పెళ్ళైయి ఎనిమిదేళ్ళు దాటిందిగాని ఏనాడూ తామిద్దరూ ఈ మాత్రం తీరికగా జంటగా కూర్చుని తినటమూ, కబుర్లాడటమూ జరగలేదు. ఆదర్శానికి పోయి పేదపిల్లను పెళ్ళి చేసుకున్నాడు కట్నం తీసుకోకుండా, తనవేపూ ఈమె వేపూ అంతా పెద్ద సంసారాలు. మంది ఎక్కువా ఇళ్ళు ఇరుకూనూ. వివాహ ప్రారంభ దినాల్లో కూడా శృంగారము, తత్సంబధమైన ఆనందమూ తానెరగడు. ఏదో అంతా నిద్రపోయారనిపించాక లేవటము, భార్య మెడ గిల్లటమూ, చెల్లాయిలో లేక మరదళ్ళో ఎక్కడ అలకిస్తారోనన్న భయంతో అతిజాగ్రత్తగా ఆ మొక్కుబడిని కాస్తా తీర్చుకోవటమూ తప్ప. నరాల అల్లరి ఆగిపోయేది. అంతే, మరే ఆనందమూ లభించేదికాదు. అంతకన్నా జంతువు నయం, ఏ ఇన్హిబిషన్సూ లేకుండా ఇంకాస్త సహజానందాన్ని అనుభవిస్తాయి...

అప్రయత్నంగా దవడలు గిట్టగరుచుకున్నాయి రామారావుకు. ఒక చిత్రమైన ఆలోచన మెదడులో వైబ్రేట్ అయింది....

వాళ్ళిద్దరినీ ఖూనీ చేసి ఆ ఇంటినాక్రమించుకుని తనూ భార్యా పిల్లలూ కాపురం చేస్తే?!

ఆ వెంటనే ఉసూరుమన్నాడు, నాగరిక సమాజము, దాని సంకుచిత న్యాయసూత్రాలూ గుర్తుకు వచ్చి...

ఆమె భర్త మాటమాటికీ జోకులు వేస్తున్నాడు, ఆమె అలా నవ్వుతూ ఉంది. కొంటెగా ముసి ముసి నవ్వులు నవ్వుతున్న ఆమె భర్త గ్లాసును నోటివద్ద ఉంచుకుని చటుక్కున తన పుక్కిట్లోని నీటిని, తెరిచి ఉన్న ఆమె నోటిలోకి ధారగా ఊదాడు. ఉక్కిరిబిక్కిరి అయిందామె. పొలమరింత అయి దగ్గసాగింది. ఆమె మొహం నిండా నీటి తడి. ఇప్పుడు నవ్వటం ఆమె భర్త వంతయింది.

అట్లాంటి శృంగారం గురించి రామారావు ఏదో ఫ్రెంచి నవలలో చదివాడు. విచిత్రమనిపించిందతనికి. డబ్బు భౌతికపరమైన సౌకర్యాలని సమకూర్చటంతో పాటు మనస్సంబంధితమైన శృంగారభావాల్ని కూడా లేపుతుంది గావును. తనలో ఏనాడూ, ఆఖరికి వివాహపు మొదటి దినాల్లో కూడా భార్య సమక్షంలో ఈ మాత్రపు శృంగారభావాలు కదలలేదు. కారణం... ఎప్పుడూ మనస్సులో నిండి ఉండే సమస్యలు! ఆర్థికపరమైనవి... కొన్నాళ్ళు ఉద్యోగంలేకా డబ్బులు లేక, ఇంకొన్నాళ్ళు ఉద్యోగం ఉండీ డబ్బులు చాలకా. ప్రస్తుతం ఆరునెలలనుంచీ మళ్ళీ నిరుద్యోగం. వ్యర్థమైన చదువు, వ్యర్థమవుతున్న యవ్వనం, ఆకలి, ఆకలి, ఆకలి....

తల విదిలించాడు రామారావు.

అమాంతంగా ఆమెను పొడువుగా రెండు చేతుల్లోకి ఎత్తుకున్నాడామె భర్త. గారాంగా ఆమె ఏదో గునుస్తోంది అతని చెవుల వద్ద.

ఆమెనలా ఎత్తుకుని అతను లోపలి గదుల్లోకి పోయాడు తలుపులైనా వేసుకోకుండా.

కొద్దిసేపు ఎదురు చూసాడు రామారావు, ఒక నిముషం, రెండు నిముషాలు. మూడు నిముషాలు.. ఇక ఆగలేక చప్పున ముందుకు నడిచాడు.

చాలా భాగం గిన్నెలకు మూతలు వేసిలేవు. స్వీట్సు, చిప్సు, అన్నము, చారు, మటన్ ఫ్రై, గడ్డ పెరుగు, ఏమేమో ఉన్నాయి. అంతవరకూ అతనిలో ముణగదీసుకుని ఉన్న ఆకలి ఒక్కసారిగా వొళ్ళు విరుచుకుంది. ఆవురావురుమంటూ వాటి మీద పడ్డాడు.

లోపలి గదిలోంచి ఉండి ఉండి ఆమె కేరింతలు మధురంగా వినిపిస్తున్నాయి.

పళ్ళెంలోకి గబగబా అన్నము, కూరలు వడ్డించుకున్నాడు రామారావు. తింటున్నాడేగాని అతనికి రుచేమీ తెలియటంలేదు. మనస్సంతా ఇంటివద్ద సొమ్మసిల్లి పడిపోయిన భార్యాబిడ్డలమీద ఉంది.

"నాన్నా! నువ్వు కూడా ఏమీ తినలేదు కదా, మరి నీకు ఆకలి కావటంలా??" తను ఆకలితో మాడుతూనే తండ్రి గురించి బెంగపడే ప్రియపుత్రుడు రాజు...

"ఏ స్నేహితుల ఇంటికన్నా వెళ్ళి ముందు మీరు, బాబూ ఇంత తిని రండి, నా సంగతి తర్వాత చూడవచ్చు." భార్య అర్థింపులో ఆప్యాయత ....

ఇంక తిన బుద్ధి కాలేదతనికి. ఒక పెద్ద గిన్నెను అందుకుని అందులోకి అన్నాన్నీ, కనిపించిన కూరల్నీ కలగాపులగంగా వేసుకున్నాడు. ఫ్రిజ్‌లోంచి కొన్ని యాపిల్ పళ్ళను తీసి జేబుల్లో కుక్కుకున్నాడు. గిన్నెతో ముందు కదలబోతూ గుమ్మంలోకి చూసి ఉలికిపడ్డాడు.

ఇందాకటి యువకుడు! ఎప్పుడు వచ్చాడో గానీ గుమ్మంలో నిలబడి తీక్షణంగా చూస్తున్నాడు తనవేపు.

"ఎవరు నువ్వు?"

"ఇంకా ఎవరని అడుగుతారేమిటండీ దొంగ అయితేనూ." అతని వెనక నిలబడి ఉన్న యువతి అంటోంది.

తిండి ధ్యాసలో పడి పరిస్థితుల్ని పట్టించుకోనందుకు తనను తాను నిందించుకున్నాడు రామారావు. గిన్నెను టేబులు మీద ఉంచాడు..

❀❀❀❀❀

"అవున్సార్, ఆ రాత్రి వాళ్ళిద్దరినీ నేను చంపేసాను.. కాదు చంపాల్సి వచ్చింది. అట్లాంటి పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది మీరు కొంచెం ఆలకించాలి. ఆరాత్రి వాళ్ళిద్దరినీ నేనెంతో బ్రతిమలాడుకున్నాను. గిన్నెలోకి ప్రోగు చేసుకున్న అన్నంతో పాటు వదిలి పెట్టమని. మొదట నా స్థితిగతుల్ని వాళ్ళకు వివరించి చెప్పటానికి ప్రయత్నించాను. ఇంటివద్ద ఆకలికి శోష్లిల్లిపోయిన నా భార్యాబిడ్డలు, నా నిరుద్యోగం, అదంతా... సంపాదనలేని వాణ్ణి. బంధుమిత్రులంతా వదిలేసారు. మొదట్లో అందిన చోటల్లా అప్పులు చేసాను. అప్పులు పుట్టటం ఆగిపోయాక ఇంట్లో రోజువారీ తిండి పెద్ద సమస్య అయిపోయింది. ఆఖరులో కొన్నాళ్ళు మొహమాటాన్ని అమ్మకానికి పెట్టి బ్రతికాను. రెండురోజుల కొకసారి ఏ మిత్రుడి ఇంటికో సకుటుంబంగా భోజనాల సమయానికి జేరుకునేవాణ్ణి ఏడవలేక నవ్వుతూ. భోజనం పెట్టక తప్పేది కాదు వాళ్ళకు. కాని మొహమాటలయినా ఎన్నాళ్ళు సాగుతాయి

కనుక! తొందరలోనే ఆ ట్రిక్కు పనిచేయటం మానేసాయి. మరీ డబ్బుకు ప్రాధాన్యమిచ్చే స్నేహితులు నాతోనే చెప్పేసారు, మరో సారి వస్తే మర్యాద దక్కదని. కాస్త మంచి మర్యాదల్ని మెయింటెయిన్ చేసేవాళ్ళు వాళ్ళ భార్యల ద్వారా ఒక రకపు ఎత్తిపొడుపుల్ని నా భార్య ముందు ప్రయోగింపజేసారు. నా భార్యను మహా ఇల్లాలుగా చెప్పుకోవచ్చు. పాపం ఆవిడ ఇట్లాంటి రోజుల్లో కూడా గుడ్ల నీళ్ళు కుక్కుకుని నాకు ధైర్యం చెప్పటానికి ప్రయత్నించేది గాని

ఏనాడూ నా అప్రయోజకత్వానికి నన్ను కించబరుస్తూ మాట్లాడి ఎరగదు. ఆమె మరోరకంగా అందరు ఆడవాళ్ళలా ప్రవర్తించి ఉన్నట్లయితే నేనింతగా సంసారం పట్ల బాధ్యతను ఫీలయి ఉండేవాణ్ణి కాదేమో. ఏనాడో రైలు క్రింద తలపెట్టి ఉండేవాణ్ణి. కాని నా భార్యాబిడ్డలు నా పట్ల అసాధారాణమైన ప్రేమను ప్రదర్శించారు. ఆ ప్రేమను తట్టుకోలేకపోయాను. రెండురోజులపాటు వాళ్ళు తిండి లేక ఇంట్లో శోషిల్లిపడిపోతే చూడలేకపోయాను. బాధ్యత నా వెన్ను తట్టింది. నీతి, మంచీ మర్యాదా, పరువు ప్రతిష్టలూ వీటికోసం ప్రాకులాడటం వెర్రితనమనిపించింది. ఆరోజయినాగాని కేవలం ఇంత తిండిని మాత్రమే దొంగిలిద్దామని మాత్రమే ఆ ఇంటికి వెళ్ళాను. నా దురదృష్టవశాత్తూ పట్టుబడ్డాను. నేను పెద్ద నేరం చేయడానికేమీ రాలేదనీ, నేను దుస్థితిని వాళ్ళకు వివరించుతూ వదిలిపెట్టమనీ ప్రాధేయపడ్డాను. కానీ వాళ్ళు నేనెంత బ్రతిమలాడినా వినిపించుకోక పోవతమూ, నన్ను పోలీసులకప్పజెప్పటమే తమ ధ్యేయమన్నట్లుగా ప్రవర్తించటమూ, అదే సమయాన అతిగా ప్రేమించే నా భార్యాబిడ్డలు నాకళ్ళముందు దీనంగా దిగులుగా కనిపించటమూ జరగటంతో నాకు నేనేమి చేస్తున్నానో తెలియని ఉన్మాదస్థితిలో అక్కడ బల్లమీద కనిపించిన పళ్ళు కోసుకునే చాకును తీసుకుని వాళ్ళతో కలబడ్డాను. తప్పించుకోవటానికి నాకంతకంటే మరో స్థితి కనిపించకపోయింది. వాళ్ళకున్నది డబ్బు సమకూర్చిన మదబలమయితే నాకున్నది సంసారం మీది ప్రేమ నా శరీరంలోకి ఆవహింపచేసిన పిచ్చి బలం. అదొక డెస్పరేట్ ఎటంప్ట్! ఆఖరికి నా పిచ్చిబలం నెగ్గింది. వాళ్ళిద్దరూ నా ఎదురుగా రక్తంలో పొర్లుతూ కనిపించారు..."

చెప్పటం ఆపి కొద్దిసేపు మౌనం వహించాడు రామారావు. తర్వాత మళ్ళీ మొదలుపెట్టాడు.

"అయ్యా! నాకిక్కడ ఒక సంగతి అర్ధం కావట ంలేదు. ఆ రాత్రి వాళ్ళను నేనెంతో బ్రతిమలాడుకున్నాను నన్ను వెళ్ళిపోనిమ్మని. కాని వాళ్ళు వొప్పుకోలేదు. నా పరిస్థితి అంతా వినివుండి కూడా. ఆఖరికి చేతులెత్తి దణ్ణం పెట్టాను. అయినా వాళ్ళలోకి దాక్షిణ్యమనేది ప్రవేశించలేదు. నేను శిక్షించబడాలన్నట్లు ప్రవర్తించారు. నిజానికి నేను వాళ్ళకు చేసిన అపకారమేమిటి? వాళ్ళకు చెందిన ఇంత తిండిని దొంగలించటం - అంతేనా? నిజంగానే అదంత పెద్ద నేరమా... పోలీసులకప్పజెప్పేంతగా.. అంటే పనిష్మెంట్ ఇవ్వబడాల్సినంతగా? ఒకళ్ళకు సంబంధించిన ఈ మాత్రపు తిండిని లాక్కోవటమే వాళ్ళకంత కోపాన్ని కలిగిస్తున్నప్పుడు నాకసలు తిండి అనేదే లభించనీకుండా అన్ని అవకాశాల్నీ లాక్కున్న ఈ వ్యవస్థ పట్ల నాకెంత క్రోధం ఉండాలంటారు? సరే, నేనేరోజు దొంగతనం చేయకుండా ఉండాల్సింది మీమీ న్యాయసూత్రాల ప్రకారం. మరయితే అట్లాంటి స్థితిలో నేనేమి చేయాలంటారు? నా భార్యాబిడ్డలు ఆకలిచావు చస్తూ ఉంటే చూస్తూ ఊరుకుని, నన్ను కూడా అదే చావుకి ఎరని కమ్మంటారా? చెప్పండి సార్, చెప్పండి!! సమాజం అల్ప సంఖ్యాంకులకు సుఖాల్నీ, అధిక సంఖ్యాకులకు కష్టాల్నీ, ఆకలినీ నిర్దేశిస్తూ ఒకరకమైన వికృత వ్యాపార న్యాయాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు, ఆన్యాయానికి బలి అవుతున్న బడుగువర్గాలు వాళ్ళకు నేర్పిన ఆటవిక న్యాయాన్ని ఆశ్రయించడం తప్పంటారా???

"బహుశా మీరు నాకు ఏ ఉరిశిక్షనో విధించవచ్చు. నాకు పెద్దగా బాధలేదు. మరి నా భార్యాబిడ్డల మాటేమిటి? వాళ్ళని ఆత్మాహుతి చేసుకొమ్మంటారా? అది కూడా మీ దృష్టిలో నేరమే!! మీ చేత స్థాపించబడే, పోషించబడే ఈ అనాధ శరణాలయాల్లో మా బోటి నీతిమంతులకి స్థానాలుండవు.

అంతకంటే నా భార్య ఏ వేశ్యాగృహాన్నో ఆశ్రయిస్తే బాగుంటుంది. నా కొడుకు ఈ కసితో, రగులుతున్న ఈ పగతో పెరిగి పెద్దవాడయ్యాక మరో యాంటీసోషల్ ఎలిమెంట్‌గా తయారవుతాడు. అప్పుడు మీరు వాళ్ళకు అప్పుడు మీరు వాళ్ళకు మళ్ళీ శిక్షలు విధిస్తారుగావును, మీరు మీరు గీసుకున్న గీతల ప్రకారం! ఎట్లాంటి న్యాయమండీ మీది?? మరో నేరం జరగకుండా ఉండటానికి సృష్టించబడాల్సిన మీ న్యాయసూత్రాలు మరిన్ని నేరాల్ని వృద్ధి చేయటానికి ఉపయోగపడుతున్నాయంటే అదీ న్యాయమేనంటారా...?

❀❀❀❀❀

చాలా కాలం నడిచిందీ కేసు కోర్టులో.

తీర్పు వెలువరించటానికి ముందురోజు రాత్రి జడ్జి మనోహరరావు తన గదిలో చాలాసేపు అసహనంగా పచార్లు. డబల్ మర్డర్ కేసు! చట్టప్రకారం ముద్దాయికి కఠినమైన శిక్షనే విధించాలి. కాని అందుకు ఆయనకు మనసొప్పటం లేదు. జరిగిన నేరంలో వ్యక్తిగతంగా ముద్దాయి కంటే సామూహికంగా వ్యవస్థకు ఎక్కువ భాగం ఉందనిపిస్తోందతనికి. ఏవ్యక్తిలోనూ పుట్టుకతోనే నేరప్రవృత్తి ఉండదనీ, సమాజపు ఆర్థిక పరిస్థితులు, పరిసర ప్రభావాలూ, సాంఘిక మానసిక పరిస్థితులూ వ్యక్తిని నేరాల్లోకినెడతాయనీ, క్రిమినల్ న్యాయచట్టాలను అమలు జరిపేటప్పుడు పై విషయాల్ని ప్రాతిపదికగా తీసుకోవాలనీ భావిస్తాడాయన. మారుతున్న సమాజంతోపాటు న్యాయశాస్త్రం కూడా మారాలంటాడు. అలా మారటానికి తనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చటానికి ప్రతి న్యాయమూర్తీ ప్రయత్నించాలంటాడు. చారిత్రాత్మకమైన తీర్పులిచ్చిన కొందరు న్యాయమూర్తులు, వాళ్ళ తీర్పులూ గుర్తుకొచ్చాయతనికి. తను సిన్సియర్ జడ్జి. ఏనాడూ తను అవనీతికి లొంగలేదు. సిన్సియార్టీకి కట్టుబడి ఉన్నాడు ఇన్నేళ్ళనుంచీ. అట్లాంటి తనకు చట్టాల్ని మార్చే లేక అవి మారటాని కి దోహదం చేసే అవకాశాల్ని క్రియేట్ చేసే హక్కుంది నైతికంగా...

❀❀❀❀❀

ఆ మర్నాడు కోర్టులో కేసు పూర్వాపరాల్ని సమీక్షిస్తూ తన తీర్పులో చివరిభాగాన్నిలా చదివాడు జడ్జి మనోహరావు.

"...ఈ కేసులో ముద్దాయి నేరం చేయటానికి మూలకారణం ఆకలి అన్నది సుస్పష్టం. ఫలానాశిక్షను నిర్దేశిస్తోందంటే దానికి వెనక ఉన్న ఉద్దేశ్యం ఆ శిక్షనుచూసి భయపడోలేక ఆ శిక్ష ద్వార పశ్చాత్తాపం చెందో ఆ వ్యక్తిగాని, సమాజంలో మరొకళ్ళుగాని మళ్ళీ అట్లాంటి నేరాన్ని చేయకుండా ఉంటారనీ, ఉండాలనీనూ. కానీ ఆర్థికపరమైన ఇట్లాంటి నేరాల విషయంలో ఆరకంగా ఆలోచించటానికి ఏ మాత్రమూ అవకాడం లేదు. ముద్దాయి విడుదలై తిరిగి సమాజంలోకి వచ్చినా మళ్ళీ ఇట్లాంటి నేరాన్ని చేయడనేందుకు గ్యారంటీ లేదు.

కారణం...

ప్రాథమికావసరాలు - అంటే తిండి, బట్ట, షెల్టర్.

ఇట్లాంటివి తీరే అవకాశాలు సామాజికంగా సుదూర భవిష్యత్తులో, ఎక్కడా లేవు కాబట్టి ముద్దాయిని శిక్షించటం ద్వారా శిక్ష యొక్క మూల ఉద్దేశ్యం! ఫుల్‌ఫిల్ కావటం లేదంటే ఆ శిక్ష వృథా ప్రయోగమన్నమాట! ముద్దాయి చదువుకున్నవాడు. అర్హతలున్న మానవుడికి అవసరాలు తీరటం లేదంటే అది అతని తప్పు కాక అతనుంటున్న సమాజానిదవుతుంది..."

ఇట్లా మరికొన్ని పేజీలు చదివాక తన తీర్పునిలా ముగించాడు జడ్జి మనోహరరావు.

"... అలా అని క్రిమినల్ నేరస్థుల్ని శిక్షించకుండా వదిలివేయటం సమాజ శ్రేయస్సు దృష్ట్యా మంచిదికాదు. కాబట్టి ముద్దాయి రామారావుకు పధ్నాలుగేళ్ళ కఠిన గారరాగారవాస శిక్షను విధిస్తున్నాను. అయితే న్యాయం పవిత్రమైనది. పరిస్థితుల కారణంగా ఒక వ్యక్తి అయినా ఒకసారి నేరం చేసినంత మాత్రాన అతని జీవితాన్ని బలి తీసుకునే హక్కు ఏ సమాజానికీ, ఏ న్యాయచట్టానికీ లేదు. ఉండరాదు కూడా. అతనికి ఒకసారి అవకాశాన్ని ఇచ్చి చూడటం మానవత్వము, నాగరికతా లక్షణము అనిపించుకుంటుంది. ఈ కారణంగా ముద్దాయిని వెంటనే జైలుకు పంపడం కాకుండా మొదటి ఏడేళ్ళపాటు ఏదైనా ఫ్యాక్టరీలో సామాన్య కార్మికుడిగా పని చేయించాలి. ఆ ఏడేళ్ళ కాలంలోనూ సంఘం అతని నడతనీ, గుణగణాల్నీ పరిశీలించి ఆ తర్వాత ఆ విషయంలో మంచి రిపోర్టులిస్తే అతనికి విధించిన శిక్ష దానికదే రద్దవుతుంది. అలాకాక చెడు రిపోర్టులు వస్తే మాత్రం కోర్టు తిరిగి పరిశీలించి విధించబడ్డ అసలు శిక్షను అమలు జరపటానికి అనుమతిస్తుంది..."

# చిన్నమ్మా వీళ్ళమీద కోపగించకు

**ఎవరైనా -**

ఎక్కడో ఓ చోట -

ఏదో ఓ మూల

ఏదో ఒక కాలనీలో ఉండాల్సిందే కదా!

ఆమె కూడా అట్లాగే

ఆ మధ్య కాలనీలో

ఆ చిన్ని ఇంట్లో

ముగ్గురన్నల చాటున

తండ్రి మాటున

తల్లి నీడన

సుతారంగా వెళ్ళమారుస్తోంది జీవనాన్ని!

ఆమె పేరు పద్మ.

పద్మ కాలేజీలో చదువుతోంది.ఇంటి నుంచీ బయల్దేరి, కొంతదూరం నడిచి, బస్సెక్కి, బస్సు దిగి నడిచి కాలేజీ మెట్లెక్కుతుంది.

పద్మ మంచి తెలివైన పిల్ల. మంచి మార్కులు తెచ్చుకుంటుంది. ఇంటివద్ద బాగా చదువుకుంది. పెద్ద పెద్ద యాంబిషన్స్ ఉన్నాయామెకు డాక్టరు కావాలనీ, సైంటిస్టు కావాలనీ లేకపోతే కలెక్టరు కావాలనీ....

రాత్రులు ఇంటివద్ద చదువుకునే సమయంలో ఆమె సడన్‌గా చదువునాపేసి కలల్లోకి వెళ్ళిపోతుంది - కారు, మంచి బంగళా, మంచి ఉద్యోగం, మంచి భర్త, సమాజంలో హోదా ఓ గుర్తింపు (తనద్వారానే, భర్త ద్వారా కాదు!) అందరి చూపుల్లో

ఈర్ష్య - ఆమె కలల్లో ఆమె సామ్రాజ్ఞి, ఆమెది ఓ రాణివాసం, ఒక చూపుతో, వ్రేలి కదలికతో ఆజ్ఞలను జారీ చేస్తుంది. ఆదేశాలను అందజేస్తుంది.

అలా అలా ఆమె తన మానాన తాను చదువుకుంటూ తన కలల్ని పోషించుకుంటూ అందంగా, అమాయకంగా, ఆదర్శవంతంగా జీవిస్తున్నవేళ..

ఆమె బస్సు కోసం ఎదురు చూస్తోంది.

బస్సులన్నీ కిక్కిరిసి ఉంటున్నాయి.

వాడెవడో అవారాగాడు ఆమెకు కొంచెం అవతలగా నిలబడి ఉన్నాడు. ఆమెవేపు చూస్తున్నాడు. చూపును మళ్ళించుకుంది. కొద్దిసేపున్నాక డవుటొచ్చి మళ్ళీ చూసింది. వాడు తనవేపే ఇంకా చూస్తున్నాడు. ఆమె మనస్సులో అనీజీనెస్ మొదలయింది. శరీర భంగిమను ఇటు మార్చిందీ, అటు మార్చిందీ. ఈ కాలు మీద నిలబడిందీ, ఆ కాలు మీద నిలబడిందీ. వాడుమాత్రం ఇటే చూస్తున్నాడు...

మరో రోజు.

ఆమె బస్సు కోసమే ఎదురు చూస్తోంది. అదే అవారాగాడు ఆమెకు ఇంకొంచెం దగ్గరలో నిలబడి ఉన్నాడు. ఆమెవేపే చూస్తున్నాడు. ఆమెలో అనీజీయే అనీజీ.

ఇంకోరోజు.

మళ్ళీ ఆమె బస్సుకోసమే -

ఈసారి ఆ అవారాగాడితో పాటు మరో ఇద్దరు ఉన్నారు. ఆ ముగ్గురూ కలిసి ఈమె గురించి ఏదో అంటున్నారు. ఈమె గుండెలు గుబగుబా కొట్టుకుంటున్నాయి.

బెదిరిన లేడికూనలా ఆమె చకచకా, చెంగు చెంగునా నడుచుకుంటూ నలుగుకుంటూ లోపలికి పోయింది. సీటు లేక మంది మధ్య నిలబడింది. కొద్దిసేపయాక వెనక నుంచీ, ఎవరో కావాలని నొక్కుకుంటున్నట్లుగా అనిపించి వెనక్కు చూసింది కదా-

వాడెవడో కాదు, ఆ అవారాగాడే!

అరి భగవంతుడా!! ఆమె కాళ్ళు వణికాయి. కళ్ళు వణికాయి. చేతులు వణికాయి. గుండెలు వణికాయి. మెదడులోని మృదు కేంద్రాలు వణికాయి.

"చీకటి కుంపటిలా అస్పష్ట భవిష్యత్తు రాజుకుంటున్నది రవ్వలు రవ్వలై చుక్కలు చుక్కలై.."

మళ్ళీ బస్టాపు.

ఆమెతో పాటు మరో మిత్రురాలు ఉంది. ఇద్దరూ ఉల్లాసంగా ఉన్నారు. ఇద్దరూ ఉత్సాహంగా ఉన్నారు. ఇద్దరూ ఏమేమో మాట్లాడుకుంటున్నారు. ఇద్దరూ ఏమోమో జోకులు వేసుకుంటున్నారు. ఇద్దరూ పకాలుమని నవ్వుకుంటున్నారు. అలా పద్మ ఒకసారి పకాలుమని నవ్విన సమయాన -

"హాయ్ స్వీటీ!"

చటుక్కున ఆమె నవ్వు ఆగిపోయింది. ఎదురుగా ఆ అవారా యువకుడు! వాడి పక్కనే వాడి దోస్తులు -

"హాయ్ బ్యూటీ!" మరొకడు అందుకున్నాడు.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు!"

"రవ్వలడ్డులా ఉందిరా!"

"పోలీసుకు రిపోర్టు చేస్తాను."

"బాదం హల్వాలా ఉంది బాసూ!"

"చికెన్ ముక్కలా ఉంది బ్రెదరూ!!"

భయంతో ఆమె రోమాలు నిక్కబొడుచుకున్నట్లయ్యాయి.

"అందమైన తెల్లని, నవ్వు నీ మెడలో
గొలుసు గొలుసులుగా కదిలినప్పుడు,
అదో విధమైన చెమ్మగిల్లిన చూపు
నెమలి రెక్కలా విప్పుకున్నప్పుడు జాగ్రత్త సుమీ జాగ్రత్త!"

రోజు రోజూ ఇదే తంతు. ఆ అవారాగాళ్ళు ఆమెను రోజూ ఆటలు పట్టిస్తున్నారు. ఏమేమో అంటున్నారు. ఆమెకు భయం భయంగా ఉంది. బెంబేలు బెంబేలుగా ఉంది. పోలీసులకు రిపోర్టిద్దామంటే మరింత బెదురు వాళ్ళు ఇంకా పగ పడతారేమోనని, ఇంట్లో వాళ్ళకు చెబుదామన్నా భయమే తల్లిదండ్రులు ఏమంటారో, ఏమి జరుగుతుందోనని. అదో పెద్ద మెంటల్ టార్చర్. ఆఖరికి భరించలేక తల్లితో చెప్పుకుని బావురమన్నది. తల్లి తండ్రితో చెప్పింది. అది అన్నలకు తెలిసింది. అంతా కలిసి చర్చించుకున్నారు. వాళ్ళు మధ్యతరగతి మనుష్యులు. వాళ్ళకు పరుపు మీద పట్టింపులు ఎక్కువ. ఆడపిల్లల భవిష్యత్తు భర్తలమీద ఆధారపడి ఉంటుందని భావిస్తారు. ఇలాంటి గొడవల్లో పడితే కూతురు పెళ్ళికాదేమోనని భయం. అన్నలు ఆమెను కాలేజీ మానేయమన్నారు. తండ్రి ఆమెతో "నువ్వే ఏదో రెచ్చగొట్టి ఉంటావు" అని అన్నాడు. చాతకాక ఆమెనే తిట్టారు అందరూ.

ఆ రాత్రి దుప్పటి ముసుగులో ఆమె కుళ్ళి కుళ్ళి కుమిలి కుమిలి ఏడ్చింది...

"చిన్నమ్మా!"
వీళ్ళమీద కోపగించకు వీళ్ళ నసహ్యించుకోకు
వీళ్ళందరూ భయపడిపోయిన మనుష్యులు.
మరో సగం మరుగున పడిన భయస్తులు, బాధాగ్రస్తులు."

రాత్రి సమయం.

పద్మ చదువుకుంటోంది.

"కిటికీ అవతల కుండీలోని పూల మొక్కల పచ్చని ఆకుల పచ్చి వాసనలు
మెరుస్తున్న ఆర్ధ్ర మరువం, దవనం
మల్లెచెండ్లు మేల్కొల్పిన
పచ్చని తొలి వేసవి జాగృతి ఆమె చిరునవ్వులో
కవిత్వం లాంటి కొత్తదనం మెరిసింది..."

అలా ఆమె నిద్రలోకి జారిపోయింది.

నిద్రలో...

రోడ్డు - రోడ్డుపక్క తాను తన పక్క ఆ అవారాగాడు - వాడు తనను చూసి ఏదో అంటున్నాడు - తిరిగి తను ఏదో అన్నది - వాడు మళ్ళీ ఏదో అన్నాడు - తను కోపంతో చెయ్యెత్తింది. వాడు గభాల్న తన చేతిని పట్టుకున్నాడు. తాను చేతిని

విదిలించుకుని పరుగు తీసింది. వాడు వెంట పడ్డాడు. తాను  పరుగుతీస్తూ ఉంది వాడు వెనక పరుగెడుతూ ఉన్నాడు. అవతల ఏదో అగాధం నల్లగా కనిపిస్తోంది. ఆ అగాధం అవతల తండ్రి, తల్లి, అన్నలూ తన వేపు నిస్సహాయంగా, కోపంగా చూస్తున్నారు - రొప్పుతోందామె, రోజుతోందామె..

గభాల్న మేల్కొందామె. ఒంటినిండా చెమటలు పుట్టివున్నాయి. గుండెలు ఎగిసి పడుతున్నాయి. అవిసిపోతున్నాయి.

ఆ రాత్రి ఇంటికి చాలా ఆలస్యంగా తిరుగు ముఖం పట్టింది. ఆఖరి బస్సును ఎక్కింది. కాలేజీలో ఫంక్షన్ ఉంది. అన్నలు అసలు వెళ్ళొద్దన్నారు. కానీ సహజ చాపల్యం - ఆమె కొన్ని ప్రైజులు తీసుకోవాల్సి ఉంది. అందుకని తల్లిని బతిమాలి, ఆమెని ఒప్పించి, ఆమె చేత మిగతావాళ్ళని ఒప్పించి ఫంక్షన్‌కి వెళ్ళింది. ప్రైజులు స్వీకరించింది సగర్వంగా. కానీ -

సగర్వం కాస్తా రోడ్డు మీదకి వచ్చేసరికి నీరుగారిపోయింది. అక్కడ ఆ నిర్జనపు బస్టాండువద్ద ఆవారాగాడు మరొకడితో..

ఆమె గుండెల్లో రాయి పడింది.

బస్సు వచ్చేదాకా వాడు ఏవేవో రహస్య సూచనలున్న దొంగమాటలు అంటూనే ఉన్నాడు. బస్సు వచ్చింది. ఆమె ఎక్కింది. వాడూ అధిరోహించాడు వాహనాన్ని. ఆమె బస్సు దిగింది. వాడూ వాడితో పాటున్న రెండోవాడూ దిగారు నడుస్తోందామె. కాస్త వెనకగా వాళ్ళు నడుస్తున్నారు.

"చీకటి..
చిటారు కొమ్మలో నక్షత్రం చిక్కుకుంది.
శిథిల సంధ్యాగగనం రుధిరాన్ని కక్కుకుంది.
దారంతా గోతులు ఇల్లేమో దూరం
చేతిలో దీపం లేదు, ధైర్యమే కవచం.."

ఓ చీకటి సందులోకి వచ్చిందామె. అటునుంచీ తప్ప ఆమె వెళ్ళడానికి దారిలేదు.

ఆ చీకటి సందులో -

వాళ్ళిద్దరూ చకచకా ఆమెను చేరుకున్నారు. గభాల్న ఆమెను పట్టుకున్నారు. కామాతురంగా వాటేసుకున్నారు. ఈ బుగ్గ కొరికారు, ఆ బుగ్గ కొరికారు. అవతలకి లాగాలని చూశారు. ఇటు గుంజుకుందామె, అటు గుంజుకుందామె. నిశ్శబ్దంగా ప్రతిఘటించాలని ప్రయత్నించింది. కుదరకపోయేసరికి పెద్దగా కేకలు పెట్టింది. ఆమె మొరను శ్రీకృష్ణుడు విన్నట్లున్నాడు. ఎవరో వీధిలోకి వచ్చారు. ఆమెను వదిలేసి అవారాలిద్దరూ ఎటో పారిపోయారు. వాళ్ళకంటే వేగంగా ఆమె ఇంటివేపు పరుగు తీసింది.

"నిశ్శబ్దపు మెత్తని పరుపులపై
నిదురించెను పట్టణమంతా
కొండ చివర ఎర్రని నక్షత్రం
రాలిపడింది సముద్ర నీలంలో..."

"అందరూ నిద్రపోతున్నారు.
అలసి నిత్యజీవితంలో సొలసి సుషుప్తిత చెందారు.
అలవాటునీ అస్వతంత్రతనీ కావలించుకున్నారు.
అధైర్యంతో తమలో తాము ముడుచుకు పోయి పడుకున్నారు"

అలాంటి సమయాన -

ఆమె కళ్ళవెంట నీళ్ళు కారుస్తూ -

ఉత్తరం రాయసాగింది.

"నను గన్న తండ్రీ,

నను గన్న తల్లీ,

నా తోడబుట్టిన అన్నలారా,

ఏమని చెప్పమంటారు మీకు? తెలిసో తెలియకో నేను కొన్ని జీవిత లక్ష్యాలను ఎంచుకున్నాను. బాగా చదువుకోవాలి. చదువుకుని ఉద్యోగం వెలగబెట్టాలి. ఉద్యోగపు వెలుగుబాటలో వ్యక్తిత్వం పెరిగిపోవాలి. ఆ వ్యక్తిత్వంలో నేను ఎవ్వరికీ తల వంచకూడదు. నేను నలుగురిని పోషించాలి. నలుగురు నన్ను మెచ్చాలి. నలుగురు నా నీడలో బ్రతకాలి. "ఫలానా పద్మ"అంటూ నలుగురి నోళ్ళలో నేను గొప్పగా నానాలి. ఇవి తల్లీ నా ఆశలు. ఇవి తండ్రీ నా కోర్కెలు. ఇవి అన్నలారా నా ధ్యేయాలు, ఈ ధ్యేయాల కోసం, ఈ ఆశల సాఫల్యం కోసం, ఈ ఆదర్శాల లక్ష్యంతో నేను చదువును పట్టుదలతో సాగిస్తున్నాను. మీరు చూస్తున్నారు కదా ఏనాడన్నా నాకు క్లాసులో మిగతా వాళ్ళకంటే మార్కులు తక్కువ వచ్చాయా? ఏనాడన్నా నేను పరీక్షలో తప్పి ఎరుగుదునా?? నిజానికి నన్ను మీరు నెత్తిమీద పెట్టుకోవాలి. పువ్వుల్లో పెట్టి కాపాడాలి, కానీ.. కానీ.. చదువును మానేపించేస్తామన్నారు. దీనిని మించిన దురదృష్టం ఏమిటంటే - నా రూపం నా జీవితాన్ని కాటేస్తోంది - నా యవ్వనం, నా సౌష్టం - బజార్న బలాదూరుగా తిరిగే ఆబోతుల్ని ఆకర్షించుతోంది - దానికి నేనేమి చేయను? నా ముక్కు కోసుకోనా? నా కన్ను పెరుక్కోనా? ఒక ఆడదానిగా - ఒక అబలగా - ఒక బేలగా - ఇవేమీ చేయలేక, మీతో చెప్పుకున్నాను -అన్నలారా అమ్మ మీతో చెప్పలేదా? తండ్రీ అమ్మ నీతో చెప్పలేదా? తల్లీ నేను నీతో చెప్పుకుని ఏడవలేదా?? అయితే అందుకు మీరెలా స్పందించారు? నాకేమన్నా ఓదార్పు నిచ్చారా? నీకు మేమున్నామని నా భుజం తట్టారా? నా భయం పోగొట్టారా? నేను చెప్పేది మీకు న్యూసెన్స్‌గా కనిపించింది. అందుకని ఆ చదువును మానేయడమే? జీవిత లక్ష్యాన్ని చెరిపేసుకోవడమే? ఆ పని చేస్తే ఇంక నా అసిత్వమేమిటి? నా వ్యక్తిత్వమేమిటి? నా జీవితమే ఒక సున్నాకాదా? ఆ సున్నాని నేను భరించగలనా? అందుకే బయట రౌడీలు నన్ను అల్లరి చేస్తున్నా, బెదిరిస్తున్నా, భయపెడుతున్నా కిమ్మనక, లోలోపల బెంగటిల్లుతూ, పైపైకి గాంభీర్యాన్ని ప్రకటిస్తూ, రాత్రులు కుళ్ళుతూ, బెక్కుతూ ,బెక్కుతూ బెంబేలు బెంబేలుగా బ్రతుకును వెళ్ళమారుస్తున్నాను. నా గోడు పట్టించుకున్నవారు లేరు. నన్ను వినిపించుకున్నవారు లేరు.

నామీద ఎవరికి కనికరం లేదు. నా తండ్రికి - తల్లికి - నా అన్నలకు - నను పాలించే ప్రభువులకు - నన్ను రక్షించాల్సిన రక్షకభటులకు.. అందుకే అన్నలారా బలయిపోతున్నాను. రౌడీలు నన్ను పెట్టే వేధింపు పరాకాష్టకు చేరుకుంది. దాన్ని మీకు చెప్పలేను - ఆ ఆబోతులు నన్ను కుమ్మబోయాయి - నన్ను కాటేయబోయాయి ఆ విషసర్పాలు - కులాసా పురుషులు నన్ను మేసేయబోయారు. ఆ బారి నుంచీ నేనిప్పటికి తప్పుకున్నా ఇంక తప్పుకోలేననిపిస్తోంది. ఆ అవమానాన్ని భరించలేననిపిస్తోంది. అందుకే నన్ను గన్న నా తండ్రీ, ననుగన్న నా తల్లీ, నా తోడబుట్టిన అన్నలారా - వెళ్ళిపోతున్నాను మీకు

దూరంగా మీకు అందని సుదూర తీరాలకి, నాకోసం మీరు ఇప్పుడు ఏడవండేడవండి - నా కసిదీరా ఏడవండి. తండ్రీ బాగా ఏడవండి!! సెలవు సెలవు.."

ఇది రాసిన తర్వాత ఆమె గది మధ్య కుర్చీ వేసుకుని చీరను ఫానుకు ముడి వేయసాగింది.

ఆ సమయాన ఆకాశాన అదృశ్యంగా విహరిస్తున్న ఒక తెలుగు కవి ఆత్మ లోకం మీద జాలితో చిన్నగా ఇలా రోదించసాగింది.

"చిన్నమ్మా
వీళ్ళమీద కోపగించకు
వీళ్ళను అసహ్యించుకోకు
వీళ్ళందరూ ముక్కలైన గాజుపెంకులు
తమని తామే మోసగించుకునే విద్యాధికులు, విదూషకులు
తమ చెట్ల కొమ్మని తామే నరుక్కునే అమాయకులు, సంప్రదాయకులు
చిన్నమ్మా
వీళ్ళమీద కోపగించకు
వీళ్ళను అసహ్యించుకోకు..."

## బటర్ ఫ్లై ...బటర్ ఫ్లై..
## .నీలోని బటరెంత

**బటర్ ఫ్లై.... బటర్ఫ్లై... నీలోని బటరెంత?**

అతను కలవాళ్ళబ్బాయి. బాగా చదువుకున్నాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. అతను చదువుకోవటానికి పెద్దగా కష్టపడలేదు. తండ్రి కావలసినన్ని డబ్బులు పంపేవాడు. "మంచిగా బుద్ధిగా ఉండరా నాన్నా" అనేవాడాయన. తూచా తప్పకుండా పాటించేవాడతను.

మంచి బట్టలు, నిగనిగలాడే బుగ్గలు, ఒంటినిండా బోలెడు నెత్తురు, మనస్సు నిండా బోలెడు కోర్కెలు, ఏ రకంగా చూసినా పట్టపగ్గాలు లేకుండా, అచ్చు విడిచిన ఆబోతులా బతికాడతను.

ఇదంతా చదువుకునే రోజుల్లో మాట..

మరో మాటలో చెప్పాలంటే వయసులో ఉన్న కుర్రవాడు ఎంత ఊపులో బతకవచ్చో అంత ఊపుగానూ రోజుల్ని వెళ్ళమార్చాడతను.

విచ్చలవిడిగా సిన్మాలు, పిక్నిక్‌లు, స్కూటర్‌ల మీద పరుగులు, పందాలు తరచుగా కొట్లాటలు అమ్మాయిల్ని ఏడిపించటం (అంత మట్టుకే - అది బుద్ధిమంతుల లక్షణం - అతనూ ఎంతో కొంత బుద్ధిమంతుడే మరి) - ఇలాంటి అన్ని కలాపాలలోనూ, విరివిగానూ, విచ్చలవిడిగానూ పాల్గొన్నాడతను.

తర్వాత ఉద్యోగం!

ఉద్యోగం అతనికి పెద్దగా కష్టపడకుండానే లభించింది. తండ్రి పరపతితోనేమి, అయినవాళ్ళ హోదాల సహకారంతోనేమీ, మొత్తానికి మంచి ఉద్యోగమే లభించింది.

అదృష్టవంతుడతను. నోట్లో బంగారు స్పూనుతో పుట్టినవాడు. చూడటానికి బంగారుబాబు. తండ్రికి బంగారు గుడ్లు పెట్టే బాతు. ఆ బాతును ఎప్పుడు అంగట్లో పెడదామా అని తహతహలాడుతున్నాడాయన. అలాంటి సమయంలో...

అతని పేరు చెప్పనేలేదు కదూ, సురేష్ - సురేష్‌కి ఇంటివద్ద లక్షల కట్నంతో వచ్చే అమ్మాయికోసం వెతుకుతున్నారు. అతను మాత్రం ఇక్కడ ఒంటరిగా, ఉద్యోగం చేసుకుంటూ సాయంత్రాలు సినిమాహాళ్ళలోనూ, టాంక్‌బండ్ మీదా, సుల్తాన్‌బజారు ఇరుకులోనూ తోచక తిరుగుతున్నవేళ - ఒకానొకరోజు -

రాత్రి ఎనిమిది దాటిన తరువాత-

సుల్తాన్ బజారులో -

ఆమె పరిచయమైయింది.

ఎరుపు నలుపుల సమ్మిళిత వర్ణంలో ఉందామె. మధ్యరకం ఎత్తులో ఉంది. నునుపాటి మెడతో ఉంది. గుచ్చుకునే కళ్ళు కలిగి ఉంది. హత్తుకోవాలనిపించే ఛాతీ కలిగి ఉంది.

అతడు రోడ్డు మీద బండిపైన బ్యాగుల్ని ఖరీదు చేస్తున్నవేళ -

ఆమె వచ్చి అతని పక్కనే నిలబడింది.

తను కూడా ఈ సంచినీ ఆ సంచినీ వెతుకుతూ అనుకోకుండానో కావాలనో అతనికి ఆనుకున్నట్టు నిలబడింది. ఆమె భుజం అతని జబ్బకు తగుల్తోంది. వొత్తుకుంటోంది.

ఇదేమిటా అని పక్కకు చూసేసరికి ఆమె కూడా అదే సమయాన అతని వేపు చూసింది.

తెలుగు సినిమాలలోలా, తెలుగు ఆడపిల్లల కలల్లోలా ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి.

ఆమె కళ్ళు వాల్చేసుకుంది.

అతను చూపులు మరల్చుకున్నాడు.

తర్వాత ఆమె ఒక సంచి తీసుకుని అక్కణ్ణుంచీ కదిలిపోయింది.

కొద్ది దూరం పోయాక ఆమె వెనక్కు చూసేసరికి అతను తన వెనకే నడుస్తున్నాడు.

''మీరు నా వెంట బడుతున్నారు'', అందామె.

"లేదు, వెనక నడుస్తున్నాను", అన్నాడతను.

కిసుక్కుమందామె.

"భలే మాట్లాడతారే" అంది.

"ఇంకా పూర్తిగా మాట్లాడందే" అన్నాడతను.

"మీరు వెనుక నడుస్తుంటే మీరెవరో చెడ్డవాళ్ళలా ఉన్నారు అనుకున్నాను" అందామె.

"మీరు ముందు నడుస్తుంటే భలే అందంగా ఉన్నారే అనుకున్నాను" అన్నాడతను.

ఇద్దరూ కిసుకు కిసుకుమని నవ్వుకున్నారు.

అలా మొదలయింది వాళ్ళ స్నేహం! ఆ తర్వాత వాళ్ళు చాలాచోట్ల చాలా వేళలలో కలుసుకున్నారు. హృదయాలూ శరీరాలూ చేరువయాయి. ఆ రెంటికీ చాలా అవినాభావ సంబంధం ఉంది... హృదయం మార్కు బొమ్మకీ, స్త్రీ శరీరంలో ఏదో భాగానికీ సారూప్యత కనిపిస్తుంటుంది కదండీ... సరే, సరే..

ఆమె అతనుంటున్న గదికి వచ్చిపోతుంది.

"నేను చాలా పేదదాన్ని" అందామె ఒకసారి.

నవ్వాడతను.

ఆ రాత్రి అతనికి తన దేహాన్ని అర్పించిందామె. అదయాక ఏడవడం మొదలెట్టింది.

"ఎందుకు ఏడుస్తున్నావు," అన్నాడతను.

ఎందుకో చెప్పకుండా ఆమె ఏడుపును ఇంకాస్త ఎక్కువ చేసింది.

"నిన్ను పెళ్ళి చేసుకోనని భయమా" అన్నాడతను.

కాదందామె.

"మరెందుకు" అన్నాడతను.

ఇంటివద్ద తల్లి జబ్బుతో పడి ఉందనీ, మందులు కొనటానికి డబ్బులు లేవనీ అది గుర్తొచ్చి ఏడుస్తున్నాననీ అందామె.

"ఎంత కావాలి?" అన్నాడతను.

"ఆరువందలు" అందామె.

జేబులోంచి ఆరువందలని తీసి ఆమెకిచ్చాడతను. ఆ క్రితం రోజే జీతం అందుకున్నాడు.

మొదట ఆమె తిరస్కరించింది. ఆ తర్వాత ఎలాగైతేనేం తీసుకుంది.

అప్పట్నించీ వాళ్ళిద్దరి మధ్యా అనుబంధం మరింత పెరిగింది. నాలుగయిదు రోజులకు ఒకసారి ఆమె అతని వద్దకు వస్తుంది. ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్తారు. హోటేలుకు వెళ్తారు 'యాంకీ జాంకీ'కి వెళ్తారు.

ఖర్చే ఖర్చు! మొత్తాన్నీ అతనే భరిస్తాడు. (ఆమె పేదది కదండీ పాపం!)

ఒకోసారి ఆమెను "శారీప్లాజా"కి తీసుకువెళతాడు. మంచి శారీ కొంటాడు. పర్సు సగం ఖాళీ అవుతుంది.

'నా రాజాగా' అంటూ మత్తుగా మెరుపు కళ్ళతో చూస్తుందామె.

కూసింత సేపు స్వర్గంలో విహరించి వస్తాడతను.

అలా అలా ఓ ఆర్నెల్లు గడిచాయి. ఓరోజతను నీ అభిమాన క్రికెటరు ఎవరు అని అడిగాడామెను. "ధోనీ" అందామె. నీ అభిమాన హీరో ఎవరు అన్నాడు. "షారూక్‌ఖాన్" అందామె. నీ అభిమాన రాజకీయ నాయకుడెవరు అన్నాడు. "బిల్‌క్లింటన్" అందామె.

"అయితే నువ్వు నీ స్వయంవరాన్ని ప్రకటించావనుకుందాము. ఆ ముగ్గురూ నాతోపాటు ఆ సభకు హాజరయితే ఎవరి మెడలో దండ వేస్తావు" అన్నాడతను.

"ముందు నీ మూతి మీద ముద్దు పెట్టుకుంటాను," అందామె.

"తర్వాత"? అన్నాడతను-

"కొత్త చెప్పు తీసుకుని ఆ ముగ్గురినీ మూతిపళ్ళు రాలగొడతాను"అందామె

"అదేమిటీ" అన్నాడతను.

"లేకపోతే నా ప్రియుడు నాకుండగా వాళ్ళెవరు మధ్యలో రావటానికి" అందామె. ఆమె మాటలకు అతనికి ఎంతో సంతోషం వేసింది. కానీ...

ఆమె సన్నిధానం అతనికి స్వర్గధామంగానే అనిపించినా ఆ సంతోషం ఎక్కువ సేపు నిలవటం లేదు. ఆమె వెళ్ళీ వెళ్ళగానే అతనికి డబ్బు లోటు కొట్టొచ్చినట్టు ఎదురుగా నిలబడి ప్రశ్నిస్తోంది. ఇరవై వేల జీతమూ అతనికిప్పుడు చాలటం లేదు. ఆమె దగ్గర ఉన్నంత సేపూ ఏదో ఓ నెపాన డబ్బులు విచ్చలవిడిగా ఖర్చయిపోతున్నాయి. ఇంటివద్ద మందులకని వాటికనీ ఆమె కొంత కొంత రొక్కాన్ని పట్టుకుపోతుంది.

అసలు ఆమె ప్రేమ సిసలయిందేనా??

ఈ మధ్య ఈ సందేహం ఒకటి అతనిలో ప్రవేశించి అతడిని నమిలేయసాగింది. ఆమె తన వద్ద ఉన్నంత సేపూ అది "సిసలు ప్రేమ"గా కనిపిస్తుంది. కానీ ఆమె వెళ్ళగానే మాత్రం అతనిలో సందేహాన్ని ప్రవేశపెడుతుంది. అందుకు కొన్ని కారణాలున్నాయి.....

సరిగ్గా జీతాలందిన రోజున ఆమె ఏదో వంకన వస్తుంది. అతనితో లవ్వాట ఆడుతుంది. తర్వాత డబ్బులు పట్టుకు పోతుంది. ఆమె చెప్పే కారణాలన్నీ ఆ క్షణాన కూడా సహేతుకంగానే తోస్తాయి. "ఏది సత్యం, ఏది అసత్యం ఓ మహాత్మా" అంటూ పెద్దగా అతనికి అరవాలనిపిస్తుంటుంది.

క్రమంగా అతనూ అబద్దాలకు అలవాటు పడ్డాడు. ఏదో వంకన ఆమెకు డబ్బులివ్వటం మానేశాడు. ఖర్చులూ తగ్గించాడు. ఇదంతా ఆమె ప్రేమను పరీక్షించటానికి.

నెల గడిచింది. రెండు నెలలగడిచాయి. మూడు నెలలు గడిచాయి.

ఇప్పుడామె అతని వద్దకు అంతగా రావటం లేదు. వచ్చినా హృదయపూర్తిగా మాట్లాడటం లేదు.

నాలుగోనెలలో గావును ఓ రోజు ఆమె స్కూటరు మీద మరెవరో యువకుడి వెనక కూర్చుని పోతూ కనిపించింది.

ఇదంతా చానాళ్ళక్రితం మాట...

ఇప్పుడు సురేష్‌కి మ్యారేజ్ అయింది. బోలెడు కట్నం వచ్చింది. పెళ్ళాం ఇద్దరు పిల్లలను పెట్టింది. జీవితంలో ఏమీ ట్రాజడీ జరగనట్లే అతను మామూలుగా సంతోషంగా కనిపిస్తున్నాడు. అప్పుడొకసారీ, ఇప్పుడొకసారీ ఆఫీసులో స్టెనోతోనో మరో అమ్మాయితోనో పార్కులోనే సినిమాహాల్లోనో కనిపిస్తున్నాడు. మరో బటర్‌ఫ్లైగా మారాడతనిప్పుడు.

ఇలాంటి బటర్‌ఫ్లైగాళ్ళను, బటర్‌ఫ్లైగత్తెలనూ చూసినప్పుడు మాత్రం నాకిలా క్వశ్చనించాలనిపిస్తుంది.

"బటర్ ఫ్లై బటర్ ఫ్లై నీలోని బటరెంతా??

ఒకవేళ వాళ్ళే కనక హృదయం విప్పి మాట్లాడదల్చుకుంటే....

"ఒరేయ్ వెర్రి వెధవా నీలో నిజాయితీ అంతరా"

అని అంటారేమోనని భయమూ కలుగుతుంటుంది...!

# అమ్మాయిలూ జాగ్రత్త!

**కొందరికి** ఏ ఉద్యోగమూ ఉండదు. లేక ఏ చిన్న ఉద్యోగమో, మధ్యరకం ఉద్యోగమో ఉంటుంది. కానీ వాళ్ళెప్పుడూ నీటుగా ఉంటారు. పెళపెళలాడుతూ ఇస్త్రీ బట్టల మధ్య నలుగుతుంటారు. ఆ బట్టలు చాలా ఖరీదుగా ఉంటాయి. ఏమి దర్జారా నాయనా అన్నట్లుంటాయి.

వాళ్ళ పర్సుల్లో నోట్ల కట్టలు పాములు పాములుగా మెలికలు వేసుకుని ఉబ్బి ఉబ్బి కనిపిస్తుంటాయి. "వాడేమిటి వాడి జీతమెంత అంతగా మిడిసి పడుతున్నాడు" అనిపిస్తుంది మనకు. "వీడేదో ఇల్లీగల్ కార్యక్రమాలలో మునిగి ఉండవచ్చు" అనిపిస్తుంది ఇలాంటి వాళ్ళను చూసినప్పుడు.

వాడి వేషం, వాడి దర్జా, వాడి వైభోగం గమనించినప్పుడు మనకు ఈర్ష్య కలగదుగానీ "ఒరేయ్ పోలీసుల్లారా వీణ్ణి కాస్త కనిపెట్టండిరా, వీడేదో యమడేంజరుగా కనిపిస్తున్నాడు. వీడు హాజీమస్తానో, శోభారాజో కావచ్చు. దేశాన్ని పాకిస్తానుకో, ఫరిస్తానుకో అమ్మేట్లున్నాడు రోరేయ్" అని అరవాలనిపిస్తుంది.

సమాజంలో రంగ రంగ వైభోగంగా బ్రతుకుతుంటారు వీళ్ళు. పొరపాటున పై అరుపుల్ని కనక మనం అరిచామంటే అన్యాయంగా నిష్కారణంగా దారినపోయే మనల్ని పట్టుకుని జైల్లో తోయించినా తోయించేయగలరు.

"బ్రోకర్ ముండా కొడుకులు వాళ్ళతో మనకెందుకు" అంటాడు మా కొండసామి అలాంటి వాళ్ళ ప్రస్తావన వచ్చినప్పుడల్లా.

అలాంటి బ్రోకరు ముండాకొడుకులలో ఒకడే అతగాడు......

ఆ అమ్మాయి కాలేజీలో చదువుతోంది. అందంగానే ఉంటుంది (ఆ వయస్సులో అందరు ఆడపిల్లలూ అందంగానే కనిపిస్తారు). తను చాలా తెలివైనదని ఆ పిల్ల భావన (ఆ వయసు ఆడపిల్లలంతా అలానే భ్రమలలోనే ఉంటారు). ఎప్పుడూ తెగ త్రుళ్ళుతుంటుంది. సినిమాలు తెగ చూస్తుంది. తెలుగు సాహిత్యాన్ని అంతకంటే ఎక్కువ తెగ చదువుతుంది. దానా దీనా ఓ స్కిజోఫ్రెనిక్ గీసిన అర్థం పర్థం లేని బొమ్మలా తయారయిందామె మనస్సు.

రోజూ ఆమె కాలేజీకి వెళుతుంది. సాయంత్రం బస్సెక్కి మళ్ళీ ఇంటికి తిరిగి వస్తుంది. తన ఈడు వాళ్ళతో ఆ కబురు ఈ కబురు చెప్పాక, పనులు కానిచ్చుకుని పుస్తకాలు ముందు వేసుకు కూర్చుంటుంది. ఆ పుస్తకాలలో ఆమె ఏమి చదువుతుందో, ఆమె మనస్సులో ఏమి ఆలోచనలు కదులుతున్నాయో తెలుసుకోవటానికి ఆమె తల్లితండ్రులు ఏనాడూ ప్రయత్నించలేదు. అది వాళ్ళ బాధ్యతారాహిత్యం.

తను ధరించే చీర, తను పెట్టుకునే బొట్టు, తన కంటి కాటుక, తన చెంపల నునుపు, తన పెదవుల విరుపు, ఇలాంటి వాటిని అనుక్షణం తన చుట్టుపక్కనున్న వాళ్ళు గమనిస్తున్నారని భావిస్తుందామె. ఆ మాత్రం స్వయంభావన ఆ వయస్సు వాళ్ళందరికీ ఉంటుంది. అలాగే ఆమెకీ ఉంది.

వాళ్ళ కాలేజీ వదిలే సమయానికి ఆ బయట రోడు మీద కొందరు పోకిరీ కుర్రవాళ్ళు ఎదురు చూస్తుంటారు. ఆమె తన స్నేహితురాళ్ళతో కలిసి వస్తున్నప్పుడు ఆ కుర్రవాళ్ళు ఏవో మాటలు అని కాలరులు సర్దుకుంటారు. ఈ ఆడపిల్లలు ఆ మాటలు విని కోపం తెచ్చుకుంటున్నట్లు పోజు పెట్టి ఆ వెంటనే పళ్ళన్నీ బయట పెట్టి ఒక్క గిగులు గిగులుతారు. కొద్ది దూరంలో ఆ కుర్రవాళ్ళు వీళ్ళ వెనకే నడుస్తూ తమ ధోరణిలో నవ్వుతారు. మొత్తానికి వాళ్ళ ప్రవర్తనా వీళ్ళ ప్రవర్తనా కలిపి చిత్తకార్తెలో కుక్కల చేష్టల్ని గుర్తుకు తెప్పిస్తాయి. తోక ఆడించటమూ, పృష్టం తిప్పటమూ, పళ్ళు బయట పెట్టి గుర్రుమనటమూ అదంతా.... ఏనాడన్నా కుర్రవాళ్ళు కనిపించకపోయినా, వెనక నడవకపోయినా వీళ్ళు ఏదో ప్లాటరీని కోల్పోయినట్లు ఫీలవుతారు. అది టీనేజి లక్షణం!

ఆమె అలాంటి లక్షణంలో ఉన్నవేళ ఓ అందమైన యువకుడు - ఆధునికంగా కనిపిస్తున్న యువకుడు - రోజూ ఆమెకు కనిపించసాగాడు.

హీరో హోండా మీద వస్తాడతను. ఆమె వేపు చూస్తూ వెళ్తాడు. మొదటలో ఆమె చాలా సాదాగా చూసింది అతని వేపు. తర్వాత కొద్దిగా ఆసక్తిగా. ఆ తర్వాత ఆబగా. అతను కనిపించని నాడు ఎందుకు రాలేదబ్బా అనుకునేది. మర్నాడు మళ్ళీ అతను కనిపించగానే ఆమె కళ్ళు మెరిసేవి. ఆ మెరుపులు అతనికి తెలిసేవి కూడా.

ఒక రోజుతను తన హీరోహోండాని ఆమె పక్కనే ఆపి లిఫ్టిస్తాను రండి అన్నాడు హీరోలా. (ఆమెకలా అనిపించాడు!)

రానన్నట్లు తలూపిందామె.

మరోరోజు - బస్సులన్నీ కిక్కిరిసి ఉన్నవేళ - ఆమె ఎక్కలేక అవస్థపడుతున్న సమయాన - అతను ఆమె పక్కనే బండి ఆపి మళ్ళీ అన్నాడు.

"లిఫ్టిస్తాను రండి."

"మీకెందుకులెండి శ్రమ.."

"శ్రమేముందిలెండి రండి!!"

అదీ ... ఆహ్వానాలు అంగీకరించటమూ అనేది అలా స్టెప్ బై స్టెప్‌గా ఒకదాని తర్వాత ఒకటి జరుగుతాయి.

"మీరెందాకా వెళ్తారు?"

చెప్పింది.

"మీ కాలనీ వద్ద దింపుతాను సరేనా?"

"అమ్మో వద్దు. ఎవరైనా చూస్తే బాగుడదు. కాస్త ఇవతల దింపేయండి!"

ఆమె ఎక్కి అతని వెనక కూర్చుంది. ఆ క్షణాన ఆమె కాళ్ళు వణికినా లోలోపల థ్రిల్‌ని ఫీలయింది.

"గట్టిగా పట్టుకోండి", అన్నాడతను కొద్ది దూరం పోయాక సడన్ బ్రేకు వేస్తూ. `అమ్మో` అంటూ ఆమె నిజంగానే అతణ్ణి వాటేసుకుంది. వాటినే "మన్మధలీలలు" అంటారు. సినిమాల్లో చూపించేదీ, టీవీలలో కుమ్మరించేదీ ఆ రసాన్నే -

ఆ తర్వాత ఆమె చాలాసార్లు అతడి వెనుక కూర్చుని ప్రయాణించింది. ఇంటి వద్ద ఏదో వంక బెట్టి అతనితో పార్కులకు వెళ్ళింది. సూర్యా టాకీసులో మూల కూర్చుని అతనితో సినిమాలు చూసింది. శరీరాన్ని స్పృశించనిచ్చింది. మనస్సును మచ్చిక చేసుకోనిచ్చింది.

ఈ తతంగాలన్నీ జరుగుతున్న రోజుల్లో ఆమె తనకు తాను నిజమైన హీరోయిన్‌లా కనిపించింది. మిగతా ఆడపిల్లలు చవటమ్మలుగా, వాజెమ్మలుగా కనిపించారు.

లవ్ అంటే ఇదీ, జీవన మకరందమంటే ఇదీ, పిచ్చిదానిలా తల్లితండ్రులు కుదిర్చిన ఎవడితోనో తిరగటం, కాపురం చేయటం

మామూలు ఆడవాళ్ళపని, అది తనవల్ల కాదు బాబూ...

ఈ రకంగా ఆమె తన వానిటీకి మెరుగులు దిద్దుకుంటున్న సమయాన ఓ రోజు అతను (ఇప్పుడామెకు ప్రియుడు) ఎటన్నా వెళ్ళిపోదామా అన్నాడు.

అంటే ఎలోప్ -

బాప్‌రే అది మరింత థ్రిల్‌తో కూడుకున్న పని!

గుండెల్లో వణుకుడు మొదలైనా ఆ పిల్ల వప్పుకుంది.

అంతకు ముందు అతడు తనో పెద్ద వ్యాపారవేత్త కొడుకునని చెప్పుకున్నాడు. తన తండ్రి ఇప్పట్లో పెళ్ళికి వప్పుకోవటం లేదనీ ఎటన్నా తిరిగి వద్దామనీ, కొడుకో కూతురో పుట్టాక తండ్రి వప్పుకోక ఏం చేస్తాడనీ అన్నాడు.

కొడుకో కూతురో అని అతనన్నప్పుడు ఆ పిల్ల " ఛా..ఫో.." అంది సిగ్గుగా.

మరి వెళ్ళిపోదామా అని అన్నాడతను. వెళ్ళిపోదాం అందామె.

తను వీలైనన్ని డబ్బులు తీసుకుని వస్తున్నట్లూ, ఆమెను కూడా ఏమన్నా ఉంటే తెమ్మని అన్నాడతను. వీలైనంత ఎక్కువ కాలం విడిగా గడపటానికి వీలుగా...

ముహూర్తం నిశ్చయించుకున్నారు వాళ్ళు. ముందే అతను బట్టలేమీ తీసుకురావద్దనీ ఇంట్లో వాళ్ళకు డవుటొచ్చే అవకాశం ఉందనీ అన్నాడు (అంటే డబ్బులు మాత్రమే తీసుకు రమ్మని!)

ఇంటి వద్ద తనవీ, తన తల్లివీ, తన అక్క దాచుకున్న నగలూ అన్నిటినీ ఆమె (వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు) చిన్నగా తన బాగ్‌లో సర్దింది. సామాన్యంగా అలాంటి సందర్భంలో ఆడపిల్ల గుండెలు దబదబా కొట్టుకోవాలి. కాళ్ళు గడగడా వణికిపోవాలి. కానీ ఆమెలో అలాంటి టెన్షన్ ఏమీ కలగలేదు. ఏదో నూతనోత్సాహంలో, దెయ్యం పట్టిన దానిలా ఉత్తేజంతో చేసిందామె ఆ పనుల్ని. ఆమెకు అంత థ్రిల్లింగ్‌గా అనిపించిందది. అలా అనటం కంటే అతగాడి మీద ఆమెకు అంత విశ్వాసం కలిగింది అనంటే బాగుంటుంది.

అతడామెను స్టేషను బయట కలుసుకున్నాడు. అతనితోపాటు మరో నడి వయసు మనిషి కూడా ఉన్నాడు.

అతడిని తన బాబాయిగా చెప్పాడతను. తను ఆమె వెంటే వస్తే తర్వాత పోలీసు ఆరాలలో తెలిసిపోతుందనీ తమ ఇద్దరినీ వాళ్ళు తేలికగా ఆచూకీ తీయగలరనీ ఆమెను మాత్రం బాబాయి వెంట బొంబాయి రమ్మనీ తను అదే సమయంలో అక్కడికి చేరుకుంటాననీ సెలవిచ్చాడు.

తలూపిందామె. గంగిగోవులా ఆ బాబాయి వెంట నడిచింది.

ఇంక తరువాత చెప్పటానికేముంది, బొంబాయిలో ఆమె ఒక షేక్ వృద్ధుడికి అమ్మేయబడింది.

మొదటి పేరాలో చెప్పిన బ్రోకర్ ముండాకొడుకు వీటికన్నింటికీ మూలం. వాడిక్రింద ఇట్లాంటి యువకులు కొందరు పని చేస్తున్నారు. వాళ్ళను వాడు పెంచి పోషిస్తున్నాడు.

ఆ యువకుడు ఇప్పుడు మరో యువతి కోసం గాలం వేస్తూ ఎదురు చూస్తున్నాడు. పిచ్చి తల్లి ఎవతో పడుతుంది ఆ గాలానికి.

శోభారాజ్‌గానీ మరొకళ్ళు గానీ తమ తమ నేరకలాపానికి మనదేశాన్నే స్థావరంగా చేసుకోవటానికి కారణం ఇదే - పాలు తాగిన తల్లి రొమ్మని గుద్దే వాళ్ళు ఇక్కడ ఎక్కువమంది ఉంటారని తెలుసు కాబట్టి! సుఖలాలసత మీదా, ఈజీ మనీ పట్లా మనుషులలో ఉండే మోజు ఈ దేశంలో, ముఖ్యంగా బోడి నీతులు చెప్పేవాళ్ళలో ఎక్కువ -

ఓ "మంచి" నియంతను ఈ దేశం మీదకి వదలరా నాయనా - నా దేశాన్ని మరో ఆధునిక జపాన్‌లా తయారు చేయరా బాబూ......!!

****

# తొడేలు దుమికినవేళ

"ఛీర్స్!"

"ఛీర్స్!!"

గ్లాసులు పైకి లేచాయి. నోళ్ళు కరుచుకున్నాయి. గుటకలు పడ్డాయి.

వాళ్ళు నలుగురు.

నలుగురూ మంచి ఉత్సాహంలో ఉన్నారు. అట్టహాసంగా ఉన్నారు. పటాటోపంగా కనిపిస్తున్నారు.

"నాకు చాలా సంతోషంగా ఉంది బాస్" అన్నాడు భూపతి. అతనొక కంట్రాక్టరు.

రాజారావు పెద్ద ఆఫీసరు.

మామూలు సమయాలలో భూపతి రాజారావును `సార్` అంటూ సంబోధించినా మందుకొట్టే సమయంలో మట్టుకు `బాస్` అంటాడు. దానిని రాజారావు ఆనందంగా ఆమోదిస్తుంటాడు కూడా.

"ఇందులో మీకు లక్షదాకా మిగలవచ్చు అనుకుంటాను" అన్నాడు ఆచారి.

"మహా చక్కగా,"

"అయితే మరోసారి ఛీర్స్" అంటూ యాదగిరి గ్లాసును మళ్ళీ పైకిలేపి నోటివద్ద ఉంచుకున్నాడు.

నలుగురు నవ్వుకున్నారు.

ఆచారి, యాదగిరి కూడా రాజారావు ఆఫీసులోనే పని చేస్తున్నారు. కాకపోతే వీళ్ళు కాస్త చిరుద్యోగులు. వాళ్ళ సహకారంతోనే రాజారావు ఆ కాంట్రాక్టు భూపతికి వచ్చేలా చేయగలిగాడు.

ఆఫీసులో యాదగిరి, ఆచారి, రాజారావు వద్ద అణిగి ప్రవర్తించినా ఇలాంటి ప్రత్యేక సందర్భాలలో మట్టుకు సముజ్జీలలా ప్రవర్తిస్తుంటారు.

భూపతి రుణాన్ని ఉంచుకునే మనిషి కాడు. ఎవరి వాటాల్ని వాళ్ళకు ముట్టజెప్పాడు. పైగా కొసరు క్రింద ఈ పార్టీని ఏర్పాటు చేశాడు. (కొందరు వివాహాది శుభసందర్భాలలో నలుగురినీ పిలిచి భోజనాదుల్ని పెట్టి సంతోషాల్ని ఇలా వ్యక్తం చేసుకుంటారు.)

మొత్తానికి వాళ్ళు నలుగురూ సంతోషంగా ఉన్నారు. ఆనందంగా ఉన్నారు. తుళ్ళారు. పేలారు. కేరింతలు కొట్టారు. మందు కొట్టారు. మత్తుగొన్నారు. ఎంత ఆనందం!!

జీవితంలో కొందరు సెక్స్ ద్వారా ఆనందాన్ని పొందితే కొందరు తినటం, త్రాగటం ద్వారా ఆనందాన్ని పొందుతారు. (ఆ తర్వాత వాళ్ళకు మట్టుకు సెక్సు అవసరం లేదా అంటే కొందరికి అవసరం లేకపోవచ్చును, మరికొందరికి అడిషినల్ ఆనందం కింద మాత్రమే పనికి వచ్చును కదా!)

ఇప్పుడు ఆ నలుగురికి కూడా ఆ అడిషనల్ ఆనందం కావాలనిపించింది.

"ఈ సమయాన పక్కన పిల్ల కూడా ఉంటే ఎంత బావుండునో" అన్నాడు ఆచారి స్వగతంలా.

"చాలా చాలా బాగుండును!" అన్నాడు రాజారావు అరమూతల కళ్ళతో.

ఎగిరి గంతేశాడు ఆచారి.

"సార్ గ్రీన్ సిగ్నలిచ్చేశాడు భూపతోయ్" అన్నాడు కెవ్వుమంటూ.

"ఈ సమయాన దొరుకుతుందంటావా?" అన్నాడు యాదగిరి టైముచూసుకుంటూ.

అప్పటికి రాత్రి పన్నెండయింది.

"దొరక్క ఏమవుతుంది. ఈ భూపతి తల్చుకోవాలేగాని" అన్నాడు భూపతి నొసలెగరేస్తూ.

"ఇంత రాత్రి సమయాన?"

"ఆహా"

"అయితే భూపతి, సార్ కలవరిస్తున్నాడుగానీ త్వరగా అరేంజ్ చెయ్యి"అన్నాడు ఆచారి.

"నేను కలవరిస్తున్నానా నువు కలవరిస్తున్నావా ఆచారీ?" అన్నాడు రాజారావు నవ్వుతూ.

"నేనే అనుకోండీ" సిగ్గుపడుతున్నట్లుగా తల వంచుకున్నాడతను. కొద్దిసేపున్నాక అతనే మళ్ళీ అన్నాడు.

"మీరు చెబితేగానీ ఈయన ఆరేంజ్ చేయడేమోనని సార్!"

నవ్వారు నలుగురూ.

భూపతి లేచి నిలబడ్డాడు.

"అందరికీ తలో పిల్లా కావాలా, సర్దుకుందామా?"

"నలుగురు దొరికితే మంచిదే. లేకపోతే సర్దుకుందాము, ఏం చేద్దాంగానీ"

(చూశారా సార్, మనుషులలో ఎంత సర్దుబాటు ధోరణో?)

"ఒక్క గుంట దొరికినా పరవాలేదన్నమాట?"

"ఒక్కటేమిటయ్యా మగడా, అరపిల్ల దొరికినా పరవాలేదు" అన్నాడు ఆచారి ఆత్రంగా.

నవ్వారు మళ్ళీ.

"దెన్ - కమాన్ - లెటజ్‌గో" అన్నాడు భూపతి.

"అదేమిటి, ఫోను చేసి ఇక్కడికి పిలిపించరాదా?"

"ఇక్కడికి కుదరదు, ఆ బ్రోకరు గాడికి ఫోను లేదు. మనమే అక్కడికి పోదాం."

లేచి నిలబడ్డారు మిగతావాళ్ళు కూడా.

ఆ గదిలో ముగ్గురున్నారు.

మంచం మీద నాలుగేళ్ళ పాప పండుకుని ఉంది.

మంచం పక్కనే ఆ పిల్ల తల్లితండ్రులు కూర్చుని ఉన్నారు. పాపకు జ్వరంగా ఉంది.

"రఘూ పాపకు ఇంత సడన్‌గా టెంపరేచర్ పెరిగిందేమిటి?" అన్నదామె.

"నాకూ అదే అర్థం కావటం లేదు భవానీ" అన్నాడతను.

అతని పేరు రఘురాం.

మంచం పక్కనే ఉన్న ఆమె కూడా ముద్దుగా. చాలా అందంగా ఉంది. మరణశయ్య మీద ఉన్న ఆర్టిస్టుకి ఆమె కనిపించితే ఆమె బొమ్మ గీశాక చనిపోతే బాగుండునని కోరుకుంటాడతను. అలాంటి అందం ఆమెది.

రఘురామ్ పెద్దలను ఎదిరించి ఆమెను పెళ్ళిచేసుకున్నాడు. ఆమె అంటే అతనికెంతో ప్రాణం. ఆమెకు కూడా అతనంటే ప్రాణం వాళ్ళిద్దరికీ ఆ పాపంటే ప్రాణం.

ఆ మూడు ప్రాణాలూ కలిసి ఒక ప్రాణం క్రింద బ్రతుకుతున్నాయి.

"జ్వరం ఇంకా పెరిగింది రఘూ" పిల్ల వంటి మీద చేయివేసి అన్నదామె.

"అవును భవానీ" అన్నాడతను కూడా చెయ్యివేసి ఆందోళనగా...

రోడ్డు మీద ఫియట్ కారు దూసుకుపోతోంది.

స్టీరింగు ముందు భూపతి కూర్చుని ఉన్నాడు. అతని పక్కన ఆచారి కూర్చుని ఉన్నాడు. వెనక సీట్లో యాదగిరి. రాజారావులు కూర్చుని ఉన్నారు.

"బ్రోకర్ వద్దకే వెళ్దామా లేక ఏ ఇంటిమీదన్నా దాడిచేసి సంసార స్త్రీనెవరన్నా పట్టుకొద్దామా??" అన్నాడు భూపతి డ్రైవ్ చేస్తూ.

"సూపర్ థ్రిల్!" వెనక సీట్లోంచి రాజారావు గొణిగాడు.

భూపతికి కొందరు గూండాల అండదండలున్నాయి. తల్చుకుంటే అతను అంతపనీ చేయగలడని మిగతా వాళ్ళకు తెలుసు.

రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ట్యూబ్‌లైట్ల వెలుతురులో అంతా పట్టపగలులా కనిపిస్తోంది. రోడ్డును మింగుతూ ఫియట్ కారు వేగంగా దూసుకుపోతుంది.

ఎగ్జయిట్‌మెంట్‌తో ఆచారి మనస్సు ఉరకలు వేస్తోంది.

"యాభయ్యేళ్ళ ముసల్దాని పక్కలో పడుకున్నావా భూపతీ?" అన్నాడతను సడన్‌గా ఎందుకో.

"ఛత్ వెధవ ఆలోచనా నువ్వూను"

"ఆ అనుభవం ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను..."

"నీ మొహంలా ఉంటుంది" యాక్సిలేటర్‌ను భూపతి అడుగుకంటా నొక్కాడు.

"నాకెందుకో భయంగా ఉంది రఘూ, పాపను డాక్టరుకు చూపించితే మంచిదేమో!"

ఆమె కళ్ళలో నీళ్ళు చూసేసరికి రఘు లేచి నిలబడ్డాడు. పాపను భుజాన వేసుకున్నాడు.

"జాగ్రత్త, తలుపులు వేసుకో భవానీ" అంటూ బయటికి వచ్చాడు.

తలుపు వద్ద నిలబడి రోడ్డుమీద నడుస్తున్న భర్తవేపు చూస్తూ కళ్ళు తుడుచుకుందామె...

"ఇప్పుడు మనం ఎక్కడికి పోతున్నాం భూపతీ?" మత్తుగా అడిగాడు ఆచారి.

"నువ్వే చూస్తావుగా!" యాక్సిలేటర్‌ను మరింత అడుగుకు నొక్కాడు భూపతి.

సినిమాలలో ఛేజింగ్ దృశ్యంలా కారు వేగంగా పరుగెత్తుతోంది. రోడ్డు మీద ఈ వేపునుంచీ ఆ వేపుకు వంకరలు తిరుగుతోంది. మలుపులు తిరగాల్సి వచ్చినపుడు బ్రేకులు కీచుమంటూ చప్పుళ్ళు చేస్తున్నాయి.

"భలే భలే" చప్పట్లు చరుస్తూ అరుస్తున్నాడు ఆచారి.

"ఏ ఆడదాన్నయినా కిడ్నాప్ చేద్దామా భూపతీ?" అన్నాడూ ఆచారి. చాలా వైల్డుగా పనిచేస్తోంది అతని మనస్సు. కల్లుతగిన కోతిలా ఉందతని మనస్సు పని. పావుగంటనుంచీ ప్రయాణం చేస్తున్నా గమ్యం చేరుకోలేకబోయేసరికి అతనికి తహ తహగా ఉంది.

ఆచారికే కాక భూపతికి కూడా ఆ సమయాన ఏదో పెద్ద ఎడ్వెంచర్ చేయాలనిపిస్తోంది ఆ మత్తులో, ఆ కిక్‌లో...

"ఇంత రాత్రివేళ వాడెవడు రోడ్డుమీద?" దూరాన కదులుతున్న మనిషిని చూస్తూ అన్నాడు ఆచారి.

"ఒక తమాషా చేస్తాను చూడు ఆచారీ" అంటూ భూపతి కారుని సూటిగా అతని వెనక్కి పోనిచ్చాడు.

అతని ఉద్దేశ్యం ఆ మనిషిని ఆనుకునేంత దూరంలో కారును బ్రేకు వేసి అతదిని బెదరకొట్టాలని, కానీ అతని అంచనా తప్పయింది. తను బ్రేకు వేయాల్సిన సమయానికి కాక కొద్ది సెకన్లు ఆలస్యంగా బ్రేకు వేయటంతో జరగకూడనిది జరిగిపోయింది.

కారు తనను తాకీతాకగానే కెవ్వుమంటూ అరిచాడు రఘురామ్. అతని చేతిలోంచి జ్వరంతోఉన్న పిల్ల ఎగిరి అంతదూరాన పడిపోయింది. అతణ్ణి తొక్కుకుంటూ పోయిన కారు చక్రాలు అవతల పడ్డ పిల్ల తలమీదుగా వెళ్ళిపోయాయి.

దెబ్బకు పిల్ల పుచ్చె పగిలిపోయింది. రక్తం కారటం తప్ప పిల్లలో సంచలనం లేదు.

ఇవతల రఘురామ్ కాళ్ళూ, చేతులు కొట్టుకోసాగాయి. కన్వల్సివ్‌గా, పైకీ కిందకీ, అబ్బా అమ్మా అంటూ, భవానీ అనుకుంటూ ఆఁ అంటూ...

ఆఖరికి అతనిలో ఆ మూలుగుడు కూడా ఆగిపోయింది. చలనమూ ఆగిపోయింది. శ్వాసా నిలిచిపోయింది.

ఇక ఇంటివద్ద ఆమె.

రఘు ఈపాటికి పిల్లను డాక్టరుకు చూపించుతూ ఉంటాడని అనుకుంటూ. పిల్ల జ్వరాన్ని తగ్గించమని భగవంతుడిని ప్రార్థిస్తూ ఇప్పుడో ఇంకాసేపట్లోనో కూతురుతోపాటు అతను వచ్చేస్తాడని ఆశిస్తూ..

వాకిట్లో నిలబడి వీధిలోకి చూస్తోందామె -

కళ్ళు కాయలు కాచేలా, కాళ్ళు నొప్పులు పుట్టేలా -

నిలబడీ నిలబడీ నిలబడీ,

కళ్ళు తెర్చుకునీ తెర్చుకునీ, తెర్చుకునీ,

అలా వాకిట్లోకి చూస్తోంది పిచ్చితల్లి.

# నీటికంటే నెత్తురు పల్చన

నీటికంటే నెత్తురు చిక్కన.

తల్లి నెత్తురు తనయుడిలో ఉంటుంది.

తన నెత్తురు పంచుకు పుట్టిన తనయుడిని తల్లి అమితంగా ప్రేమిస్తుంది.

అందుకే 'తల్లిప్రేమ' గొప్పదంటారు. ఆదర్శపూరిత మంటారు. త్యాగభరితమంటారు.

కాని -

ఒకోసారి తల్లి నెత్తురు పల్చగా కూడా ఉంటుంది. నీటికంటే కూడా పల్చగా...

అదెలాగంటే

* * *

ఆమెకు పధ్నాలుగేళ్ళుంటాయి.

ఆ వయసులో ఆమె శరీరం ఉండాల్సిన దానికంటే ఎక్కువ పిటపిటమంటూ ఉండేది. మదం వికటించుకు చూస్తున్నట్లుండేది. యావ ఆవురావురమంటూ ఉన్నట్లుండేది.

ఆ యావను తీర్చుకోవటానికి కుక్క అయినా పరవాలేదు, గాడిద అయినా పరవాలేదు అన్నట్లుండేదామె వాలకం.

అలాంటి తరుణంలో.

కుక్కలాగా, గాడిదలాగా ప్రవర్తించిందామె. 'అతను' అలాగే ప్రవర్తించాడు. "ఎవరతను?" అని అడక్కండి. తర్వాత చెబుతాను.

ఫలితంగా కడుపు పెరిగింది.

పధ్నాలుగేళ్ళకే గర్భధారణ!

ఆమె కుంతీమ తల్లి.

"తల్లీ నీకు వందనాలు!!"

"నీ పేరు లాలస కదూ?!"

ఆ గదిలో ముగ్గురున్నారు.

లాలస.

ఆమె మేనత్త మదాలస (పేర్లు విచిత్రంగా ఉన్నాయంటారా? విచిత్రమైన మనుషుల పేర్లెప్పుడూ విచిత్రంగానే ఉంటాయి సార్)

మదాలస ప్రియుడు మాధవరావు.

"ఏమిటి ఇట్లా ఎందుకు చేశారు?" అన్నది మదాలస కోపంగా.

ఆమె ఒక హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తోంది. ఆమె ఇంట్లో ఉండి చదువుకుంటోంది లాలస. మదాలస తన ప్రియుడు మాధరావుతో కులుకుతున్న సమయాన ఆమెకు తెలియకుండా లాలస అతడితో శృంగారాన్ని పంచుకుంది. ఫలితంగానే ఈ గర్భం.

ఆరాలు తీస్తోందిప్పుడు -

"ఏమి మాధవా, అది చిన్నపిల్ల కదా - నీకన్నా బుద్ధి ఉండక్కర్లా"

"బుద్ధి ఉంటే నీ జోలికి మట్టుకు వచ్చి ఉండేవాణ్ణా? " అనుకున్నాడతను. కానీ పైకి అనలేదు.

ముగ్గురూ బుద్దులు కూడ దీసుకున్నారు మాట్లాడుకున్నారు.మంతనాలు చేశారు. ఆఖరికి...

ఒక ప్రైవేటు ఆస్పత్రిలో లాలస మగబిడ్డను కన్నది. వివాహం కాకుండానే వయస్సు దాటకుండానే...

ఆమె కుంతి పుట్టిన దేశంలో కదండీ పుట్టింది -

పిల్లవాణ్ణి ఆమె పెంచుకోనూ లేదు. కుంతిలా నదిలో వదలనూ లేదు. (దగ్గరలో నది ఉండాలి కదా?)

పైన చెప్పిన ముగ్గురూ కలిసి పిల్లవాణ్ణి అనాధశరణాలయంలో ఇవ్వటానికి ప్రయత్నించారు. ఏ కారణం వల్లనో కుదరలేదు.

మరేం చేయాలి?

అలాంటి సమయంలో - అదే నగరంలో ఉంటున్న మదాలస చెల్లెలు సత్యవతి వచ్చి వాళ్ళను ఆదుకుంది.

పిల్లవాణ్ణి తను పెంచుకుంటానని అన్నది. ఆమెకు పిల్లలు లేరు. ఆస్తి అంతగా లేకపోయినా ఆమె భర్త ఒక చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఆమె అలా అనగానే మదాలస, లాలసలిద్దరూ ఎంతో సంతోషించారు. చిన్న షరతు విధించారు. పిల్లవాడికి తన తల్లి ఎవరో ఎన్నడూ వెల్లడించకూడదని. సత్యవతి మరింత సంతోషించింది. "వీడు నా పిల్లవాడే" అన్నది. నేనెందుకు చెబుతానన్నది. నేనేమన్నా పిచ్చిదాన్నా అన్నది. అవునవును అన్నారు వాళ్ళు. కాక మరి?! అన్నదామె.

అంతా కలసి కిసుకు కిసుకు కులుక్కున్నారు. సంబరపడ్డారు. సంబరం చేసుకున్నారు.

ఇదంతా పధ్నాలుగు, పదిహేనేళ్ళ క్రితం మాట.

మరి ఇప్పుడు?!

* * *

లాలస ఒక ప్రైవేటు కంపెనీలో స్టెనోగా పనిచేస్తోంది. ముడ్డి మీదకు ముప్పైయ్యేళ్ళు వచ్చాయామెకు. ఇంకా అవివాహితే. వివాహితురాలు కావాలని కోరుకుంటోంది. అందుకు తగ్గట్లే ఓ పిచ్చి ముండావాడు దొరికాడామెకు (లోకంలో పిచ్చి ముండావాళ్ళకి, పచ్చి పుండాకోర్లకీ ఏం కొదవ కనక!) అతను ఆమె అంటే పడి చస్తున్నాడు. (మగ జంతువులు ఆడ జంతువుల్ని చూసి పడి చావనిదెప్పుడు?!) మగమేకలా "మేమే" అంటూ అతను ఆమె వెంట తిరుగుతున్నాడు. "పెళ్ళి చేసుకుంటేనే," అంటూ ఆమె ఆడమేకలా ముందు ముందుకు జరుగుతూ అతన్ని ఊరిస్తోంది.

అతను పెళ్ళికి కూడా సిద్ధంగానే ఉన్నాడు. పెళ్ళి చేసుకుందాం అన్నాడు. తన జీవితం ఒక గాడిలో పడుతోందని అనుకుందామె. అలాంటి సమయాన...

ఒకరోజు ఆమె అతనితో కలసి (అతని పేరు ప్రభాకర్) సినిమాకి వెళ్ళి, ఇంటర్వెల్‌లో హాలు కాంటీనులో థమ్సప్ త్రాగుతున్న సమయాన తన థమ్‌ని పైకిలేపుతూ ఓ పద్నాలుగేళ్ళ కుర్రవాడు వచ్చి ఆమె ప్రక్కన నిలబడ్డాడు.

"మేడమ్ నన్ను గుర్తుపట్టావా?" అన్నాడు.

"ఎవరు నువ్వు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"మీ చిన్న మేనత్త సత్యవతి లేదూ?"

ఆం ఆం ... అప్పటికే ఆమె కళ్ళు నిస్తేజమవుతున్నాయి.

"ఆమె కొడుకు వేణుని" అన్నాడతను 'కొడుకు' అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

ఆమె గుండెలు ఎగసి పడ్డాయి. అంటే వాడు తన కొడుకే. సినిమాల్లోలా కథల్లోలా ఆమె గుండెల్లోంచీ ప్రేమ పొంగి పొర్లుకురాలేదు. ఎక్కడలేని ఆనందమూ ఆమె కళ్ళల్లోకి వెల్లువలా వచ్చి విరుచుకు పడనూలేదు.

"రేపు మా ఇంటికి రా అబ్బాయ్" అంది కంగారుగా.

"మీ ఇంటి అడ్రసు చెప్పలేదు?" అన్నాడతను.

"ఓ సారీ మా ఇల్లు..." అంటూ ఆమె చెప్పబోతుండగా అతను మధ్యలోనే అడ్డుకుని కన్నింగ్‌గా నవ్వుతూ అన్నాడు.

"నాకు తెలుసులే, రెండు మూడుసార్లు దూరాన్నుంచీ చూశాను..."

"సరే సరే" అంటూ ఆమె కంగారు కంగారుగా ప్రియుణ్ణి తీసుకుని హాలులోకి ప్రవేశించింది.

"ఎవరతను" అంటూ ప్రియుడు ఏమో అడుగుతోంటే ఆమె మరేదో సర్దిచెప్పింది...

లాలస ఇప్పుడు తన ముగ్గురు తమ్ముళ్ళతో కలసి ఒక ఇంట్లోనే వుంటోంది. తమ్ముళ్ళకింకా పెళ్ళిళ్ళు కాలేదు. అంతా కలసి కట్టుగా వుంటున్నారు. (ఎంత ప్రేమ రక్తబంధం మీద!)

ఆ రాత్రి నలుగురు సమావేశమయ్యారు. వేణు సంగతి చెప్పింది ఆమె అతను డబ్బులడుగుతున్నాడనీ చెప్పింది. మొన్న ఒకసారి ఇంటికి వచ్చి తీసుకుపోయాడనీ అన్నది.

ఏం చేద్దామని అక్కా నీ ఉద్దేశ్యం, అన్నారు వాళ్ళు. "వాణ్ణి కొడుకుగా ఎట్లా ఒప్పుకోమంటార్రా చెప్పండి. ఇంక నాకు పెళ్ళవుతుందా? వీణ్ణి మళ్ళీ కొడుకుగా స్వీకరించి ఎవరినీ పెళ్ళి చేసుకోకుండా మోడులా బ్రతకమంటారా చెప్పండి" అందామె. అదీ నిజమే అన్నారు వాళ్ళు. వాళ్ళకేం తెలుసు. తమ అక్కలో 'కన్నప్రేమ' కట్టలు తెంచుకు పారుతోందేమోననుకున్నారు. పారడం లేదని తెలిసాక బిత్తరపోయారు. (వాళ్ళలో మట్టుకు భ్రాతృప్రేమ కట్టలు తెంచుకు పారుతోందండీ).

ఇక అక్కడ వేణు సంగతి - అతన్ని పెంచిన తల్లి - సత్యవతి - అతడి మీద అతి గారాబం చూపేసరికి అతడికి చదువబ్బలేదు. జులాయితనం ఏర్పడింది. ప్రతిదానికీ బెల్లించి, బెదిరించీ డబ్బులు గుంజసాగాడు ఆమెవద్ద. ఒకసారి ఆమె మరీ విసిగిపోయి ఏదో తిట్టింది. "నీ కడుపున చెడ పుట్టాను కదమ్మా?" అన్నాడతను నవ్వుతూ. "నా కడుపున పుట్టలేదు కాబట్టే ఇట్లా ప్రవర్తిస్తున్నావు" అన్నదామె అదాటున. అన్నాక నాలిక కర్చుకుంది. వాడసలే రాస్కెల్! ఆమెను గుచ్చి గుచ్చి అడిగాడు. ఆమె భయం భయంగా చెప్పేసింది.

మనుషులు మన తెలుగు సాహిత్యంలోలా, తెలుగు సినిమాలలోలా ప్రవర్తించరు సార్!. వేణు తన అసలు తల్లి ఎవరో తెలిసే సరికి  ఆమెను కలుసుకోవాలనుకున్నాడు. కలుసుకున్నాక ఆమెలో మాతృహృదయం కనిపించకపోయేసరికి, ఆమె తనను చూడగానే కంపరం కంపరంగా ప్రవర్తించేసరికి అతనికి డబ్బులు సంపాదించే మార్గం బోధపడింది. తన ఉనికి ఆమె సుఖాలకి అవరోధమని అర్థమయింది. ఆ పాయింట్ నుంచీ డబ్బులు గుంజవచ్చని తెలిసింది. ఇంక ఆమెను వేధించసాగాడు.

ఆమెను డబ్బులివ్వమని సతాయించుకున్నప్పుడెప్పుడూ అతనికి తాను తన తల్లిని సతాయిస్తున్నాని అనిపించలేదు. ఆమెకు కూడా డబ్బులిస్తున్నప్పుడెప్పుడూ వాటిని తన కొడుక్కి ఇస్తున్నట్లుగా అనిపించలేదు, బ్లాక్‌మెయిలర్‌కి ఎవరో ఇస్తున్నట్లు ఫీలయింది తప్ప.

అతనలా ఒకసారి కాదు, రెండు సార్లు కాదు. ఇరవైసార్లు, ముప్ఫయి సార్లు డబ్బులు గుంజటం జరిగింది. ఇక ఆమె భరించలేకపోయింది. దానికి ఏదో ఒక పరిష్కారం ఆలోచించాలనుకుంది. ఆలోచించించింది తమ్ముళ్ళతో కలసి ఫలితం -

* * *

ఆ గదిలో అయిదుగురున్నారు. లాలస. ఆమె తమ్ముళ్ళు ముగ్గురు. ఆమె కొడుకు వేణు -

"నన్ను నీవిలా మాటిమాటికీ డబ్బులకోసం పీడిస్తే ఎట్లారా?" అన్నది లాలస.

"నువ్వు నా అమ్మవు కదా..నిన్నుకాక ఇంకెవరిని అడగమంటావమ్మా"అన్నాడతను వ్యంగ్యంగా..

"నువ్వు అమ్మా అన్నావంటే ఊరుకోను. చెబుతున్నా నిన్ను ఏనాడో ఎవరికో ఇచ్చేశాను..."

"అది నా తప్పు కాదు కదా."

అదికాదు బాబూ - ఒక్కసారి ఆలోచించు. నీ తల్లి సుఖంగా ఉండటం నీకు మట్టుకు ఇష్టం కాదా? నువ్వు నా కొడుకువని తెలిస్తే నన్నెవరు పెళ్ళీ చేసుకుంటారు? నేను పెళ్ళి చేసుకుని సుఖంగా ఉండటం నీకిష్టం లేదా?"

"ఇష్టం లేదు" అతను చాలా ఖరాఖండిగా సమాధానం చెప్పాడు.

తెలుగు పాఠక మహాశయా (లేక మహాశయనీ) తల్లీ కొడుకుల మధ్య ఇలాంటి సంభాషణా ధోరణిని బహుశా తమరు ఆరగించుకోలేకపోవచ్చు అందుకని మిమ్మల్ని ఇబ్బంది పెట్టకుండా గబగబా చెప్పేస్తాను -

"మళ్ళీ నా జోలికి రాకుండా ఉండాలంటే నీకెంత కావాలో చెప్పు ఇస్థాను" అందామె.

"నా తల్లి బంగారు బాతు. బంగారు బాతునెవరన్నా వదులుకుంటారా. కర్కోటకులు తప్ప. " అన్నాడతను సవినయంగా. అతి వ్యంగ్యంగా.

ఆమెకు అతడు తనను ఇక వదలడని అర్థమయింది.

ఇప్పుడామె రెండిటిలో ఏదో ఒక నిర్ణయాన్ని తీసుకోవాలి.

ఒకటి కొడుకును యాక్సెప్ట్ చేసి జీవితంతో రాజీపడటం.

రెండోది - కొడుకును నయానో భయానో చెప్పి తన జోలికి రాకుండా చూసుకోవటం.

రెండోదానివైపు మొగ్గిందామె. నయాన అతను వినలేదు. ఇక భయాన!

భయాన... భయాన... అవును సార్ ఆమె దండోపాయాన్ని ప్రయోగించింది. అదీ ఎలాగనుకున్నారు....

ఆమె తన తమ్ముళ్ళకు సైగ చేసింది. ఒక తమ్ముడు వచ్చి వెనకనుంచీ ఆమె కొడుకు నోరు మూశాడు. మరొక తమ్ముడు వచ్చి ఆమె కొడుకు రెండు చేతులూ విరిచి పట్టుకున్నాడు. నిస్సహాయంగా ఉన్న ఆమె కొడుకును ఆమె మూడో తమ్ముడు కత్తితో కసకసా పొడిచేశాడండీ. అదంతా జరుగుతుంటే ఆమె ఉద్విగ్నంగా చూస్తూ ఉండిపోయింది. (ఆమె ఉద్విగ్నత ఆ కార్యాన్ని చూడలేకా లేక కొడుకు మీద ప్రేమతోనా?)

ఆ తర్వాత ఆమె ముగ్గురు తమ్ముళ్ళూ తమ మేనల్లుడి శవాన్ని మాయం చేసే కార్యక్రమంలో ఉండగా ఆమె తడిగుడ్డతో గదినిండా చిమ్మిన కొడుకు రక్తాన్ని తుడిచేసే కార్యక్రమంలో మునిగిపోయింది.

ఇలాంటి కథ రాస్తున్న రచయితా నువ్వెంత దుర్మార్గుడివిరా నాయనా, అనుకుంటున్నారా?

"ఏం చేద్దాం సార్. లోకంలో ఇలాంటి దారుణాలు ఎన్నో జరిగిపోతున్నాయి. రాయకుండా ఎలా ఉండమంటారు."

* * *

# నానాటి బ్రతుకు నాటకం

**మనస్సును ఓవర్‌హాల్ చేయడమనేది తెలుసా మీకు?**

మనలోపల ఎన్నో కోర్కెలుంటాయి. అవి ఛండాలం ఛండాలంగా ఉంటాయి. మకిలి మకిలిగా ఉంటాయి. ఆ మకిలికి మన మీద మనకే చీదర వేస్తుంటుంది. ఉదాహరణకు ఊహించని విధంగా ఎవరో వంచించినప్పుడు ఎలాగైనా వాడిని దెబ్బతీయాలనే తాపత్రయం, ఆఫీసులో మన సీనియర్ సీటు కోసం తపన, అందమైన పెళ్ళాంగల మిత్రుడి మీద కుట్ర చేయాలన్న దుగ్ధ, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పుడు అక్రమంగా సంపాదించినా పరవాలేదనే రాజీధోరణి, ఇలాంటివన్నీ ముసురుకుని మనస్సును ఇబ్బంది పెడుతున్నప్పుడు వాటిని దాచుకుని ఊరికే మనస్సులో టెన్షన్ని చీదర చేసుకోవటం కంటే ఒక చోట రిలాక్స్‌డ్‌గా కూర్చుని వాటిలో సాధ్యాసాధ్యాలు, ఉచితానుచితాలను బేరీజు వేసుకోవటం, వీధిమొగలో ఉన్న పోలీసుల్ని దృష్టిలో ఉంచుకుని మనకు అనుకూలమైన రీతిలో, ఇతరులకు అపకారం కలగని ధోరణిలో ఆలోచనలు చేయటం ఉత్తమం. అలా చేసినప్పుడు మబ్బులు విడిపోయినట్లు మనస్సు తేలిక పడుతుంది. అలాకాక ఆ సమస్యలను గానీ కోర్కెలను గానీ మనస్సులో దాచుకోవటం వల్ల కొన్నాళ్ళకి అవి కిక్కిరిసి మనస్సులో టెన్షన్ పెరిగి పెరిగి ఎప్పుడో బరస్ట్ అయిపోతామేమోననిపిస్తుంది. న్యూరోటిక్స్‌గా మారే అవకాశం ఉంటుంది.

విశాలాక్షుకు న్యూరోటిక్స్‌గా మారటం ఇష్టముండదు, అతనికి ఎప్పుడన్నా ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఓ చోట వంటరిగా కూర్చుని మనస్సును ఓవర్‌హాల్ చేసుకో ప్రయత్నిస్తాడు. సామాన్యంగా అందుకోసం అతను పెద్దగా రద్దీలేని సినిమాహాళ్ళను ఎన్నుకుంటాడు. ఆ రోజు కూడా అతనలాగే ఒక సిన్మాహాల్లోకి దూరాడు. అది ఏమి సినిమా అన్నది కూడా చూడలేదతను.

వెనగ్గా ఓమూల కూర్చున్నాడు

ఆట ఇంకా ప్రారంభం కాలేదు.

బప్పీలహరి బృందగానమేదో చెవుల్ని చిల్లులు పొడుస్తోంది.

అక్కడొకళ్ళూ ఇక్కడొకళ్ళూ తప్ప హాలులో ప్రేక్షకులు అంతగా లేరు.

మిత్రుడు అనబడే వాడొకతను ఆ పూట విశ్వారావును ఒక మాట అన్నాడు. మరొకళ్ళు అయితే అలాంటి వ్యంగ్యాన్ని పెద్ద సీరియస్‌గా పట్టించుకోకపోవచ్చు. కానీ విశ్వారావు మాత్రం ఆ మాటకు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటినుంచీ అతనిలా లోన్లీగా ఫీలవుతున్నాడు.

ఆట ప్రారంభమయే సమయానికి తన ముందు సీట్లలో ఒక జంట వచ్చి కూర్చోవటాన్ని గమనించాడు విశ్వారావు.

ఆట మొదలైంది.

టైటిల్స్, అందుకు సంబంధించిన మ్యూజిక్ -

తనలో 'హ్యూమన్ ఫోబియా' లాంటిది ఏమన్నా ఉందేమోనని తరచుగా విశ్వారావుకు సందేహం కలుగుతుంటుంది. ఒకోసారి అతనికి లోకమంతా క్రూరమృగాల మధ్య తను చిన్న బోనులో బంధించబడి ఉన్నట్లు ఉంటుంది. దుర్మార్గమైన ఆ మృగాలన్నీ తనున్న బోను చుట్టూ గుమిగూడినట్లుంటుంది. అవి తమ వాడి గోళ్ళతో తనను చీల్చటానికి ప్రయత్నిస్తున్నట్లుంటుంది. భయంతో బోనులో తను బిక్క చచ్చినట్టు ఫీలవుతుంటాడు. అలాంటి సమయంలో అతనికి ఎటన్నా పారిపోవాలనిపిస్తుంది...

చిన్నప్పటి నుంచీ అతను తల్లి వద్ద అతి గారాబంగా పెరిగాడు. తండ్రి కర్కశత్వాన్ని రుచి చూసాడు. ఏడేళ్ళపాటు దారుణ నిరుద్యోగ జీవితాన్ని అనుభవించాడు. ఆ సమయంలో తోటివాళ్ళ అలసత్వాన్ని గమనించాడు. అప్పటినుంచీ అతనిలా 'పర్సెక్యూషన్ మానియా'లాంటి ఫోబియాకి గురవుతున్నాడు.

ఆట మొదలయింది. ఏదో ఫామిలీ సెంటిమెంటు చిత్రం - పరమ అసహజంగా ఉంది. సడన్‌గా విశ్వారావుకు తన ముందు సీట్లలో ఏవో కదలికలు కనిపించాయి.

గాజుల చప్పుడు -

ముందు రెండు సీట్ల మధ్య ఖాళీ స్థలంలోంచీ వాళ్ళ తలలు కలుసుకుంటున్న దృశ్యం నీడగా -

ముద్దు పెట్టుకుంటున్నారా?

విశ్వారావు ఇక తెరమీద దృశ్యాన్ని చూడటం మానేసి తనముందు జరుగుతున్న దృశ్యాన్ని చూడటం మొదలు పెట్టాడు.

ఇంటర్వెల్ అయేదాకా అతనికి కాలమే తెలియలేదు.

ఇంటర్వెల్‌లో ముందున్న జంట లేచి నిలబడ్డారు. ఆమె స్త్రీల టాయిలెట్ వేపూ, అతడు పురుషుల ఎగ్జిట్ వేపూ నడిచారు.

చూడటానికి ఇద్దరూ చక్కగా అందంగా ఉన్నారు. ఆమె తలలో పూలున్నాయి. అతను ఇన్‌షర్ట్ చేసుకుని ఉన్నాడు.

ముచ్చటైన జంట!

అతనేవో పాకెట్లు తీసుకువచ్చాడు.

ఆమె అతని కళ్ళలోకి ప్రేమగా చూసింది

ఎంత అదృష్టవంతుడివిరా నాయనా

మళ్ళీ ఆట మొదలయింది.

తెర మీద డ్యూయెట్టు –

నాయిక నర్తిస్తోంది. అది నాట్యమా, శృంగార విన్యాసమా??

రొమ్ముని కదుపుతోంది. పిరుదుల్ని కదుపుతోంది. కటికభాగాన్ని ఊపుతోంది. ఏమిటవి సింబాలిక్ చేష్టలు – పెల్విక్ త్రస్టులు బ్లూ బ్లూ – బ్లా బ్లాక్షీప్ – బూతురా నాయనా బూతు – నాజూకు బూతు, నాగరిక నాటు–

మోరిస్ మహాశయా ఈ సెక్సునేమంటావు? కమర్షియల్ సెక్సా?? ఇదోరకం ప్రాస్టిట్యూషనా??

The Ordinary Prostitute has to Operate on a pay – as - you - lay - basis where as this woman receives indirect payment - అంటున్నావా? భలేవాడివయ్యా బాబూ – నీ అమ్మ కడుపు బంగారంగానూ...

ముందు సీట్లోంచి ఆమె ఊరికే కువకువలాడుతోంది.

తెరమీద హీరో హీరోయిన్సు ఇద్దరూ ఎక్కడెక్కడో తిరుగుతున్నారు. ఇప్పుడు అడవిలో, అంతలోనే సెలయేటి వద్ద – జల జలా నీళ్ళు – సింబాలిజమా?? మీడియోకర్ నాకొడకల్లారా మీకది కూడా తెలుసా? కానీ చూపించేస్తున్నారు గుడ్డిగా గాడగాడి –

పూలు – కొండలు ఆమె రొమ్ములు, పిరుదులూ – ఆ సెలయేటి పడి ఆమెలోని వేడికి జలరూపం – కొడకల్లారా మమ్మల్నలా ఊహించుకోమంటున్నారా?

ముందు సీట్లో ఆమె కిలకిలా నవ్వుతోంది.

అతడామెను ఎక్కడో తాకి ఉంటాడు –

హీరో హీరోయిన్‌లిద్దరూ అంతలోనే పొలాల్లోకి వచ్చేశారు – చుట్టూ పూలు పూలు – ఆమె అడ్డదిడ్డంగా పరుగుతీస్తోంది. అతడు ఆమె వెనక గెంతుతున్నాడు –

చిన్నప్పటి దృశ్యం – పొలాలలో – చిత్తకార్తె – కుక్కలు రెండు – ఒకదాని వెనక ఒకటి – ముందు ఆడదీ వెనక మగదీ – ఎక్కడికో పోతున్నాయి – గమ్యం లేకుండా...

ఆ దృశ్యానికీ ఈ దృశ్యానికీ ఏమన్నా సాపత్యముందా??

ముందు సీట్ల మధ్య నుంచీ వాళ్ళ తలలు కలుసుకుంటున్నాయి. ముద్దు పెట్టుకుంటున్నారా?

ఆ గాడిద – కొడుకుని సినిమా హాల్లోంచీ ఒక్క తన్ను బయటికి తన్ని – తనాతని సీట్లో కూర్చుని – ఆమె పెదవుల్ని సుతారంగా అందుకుని...

తెరమీద హీరోయిను ఎదయిన గొడ్డులా గెంతుతోంది. వాణ్ణి రెచ్చగొడుతున్న నెపాన జనాన్ని రెచ్చగొట్టూతోంది – ఒసేయ్ హీరోయినూ ఎంత తీసుకున్నావే ఈ చేష్టలు చేయటానికి, నన్ను తెరమీదకన్నా లాక్కో, నువ్వు తెరదిగన్నారా, ఓయీ విఠలాచార్య ఒక మంత్రం చెప్పవయ్యా బాబూ, ఈ జనాన్నంతా మాయం చేసేస్తాను. కామరోగం అంటుకుంది నాకు – ఆ ఎదయిన ఆ హీరోయినూ నేనూ ఆట ఆడుకుంటాం – డుర్ర్..

ముందు సీట్లో ఆమె కువకువా గొణుగుతోంది. కిలకిలా నవ్వుతోంది.

వాళ్ళిద్దరూ నవదంపతులుగావును, ఐడియల్ దంపతులంటే అలా ఉండాలి...

సినిమా అయిపోయింది. హాలులో ఉన్న కొద్దిమందీ లేచి నిలబడ్డారు. తన ముందున్న జంట కూడా –

వాళ్ళ వెనకే ముగ్ధంగా చూస్తూ నడవసాగాడు విశాలావు.

హాలులోంచీ బయటికి వచ్చాక జంటలోని పురుషుడు స్కూటర్ స్టాండు వేపు నడిచాడు. ఆమె గేటువేపు అడుగులు వేసింది.

ఆ పురుషుడు వచ్చి ఆమెను స్కూటర్ మీద ఎక్కించుకు పోతాడనిపించింది విశాలావుకు. కానీ అలా జరగలేదు. పైగా అతడామెను పలకరించకుండా తన దారిన వెళ్ళిపోవటం విచిత్రమనిపించింది -

ఆమె రోడ్డు మీద నిలబడి ఆటోని కేకవేసింది.

అవతలగా నిలబడ్డ విశాలావు ఈ దృశ్యాన్ని విచిత్రంగా గమనిస్తున్నాడు.

ఆ సమయాన ఒక విచిత్ర సంఘటన జరిగింది.

ఆమె ఆటోని ఎక్కబోతున్న సమయాన ఆమె పక్క ఒక స్కూటరు వచ్చి ఆగింది. స్కూటరు మీద నల్లగా లావుగా ఉన్న ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

"ఇక్కడ ఉన్నావేమిటి సుజా?" అతడడిగాడు.

"తోచకపోతే సినిమాకు వచ్చానండీ!"

"ఇంటికి వెళితే తాళం వేసివుంది. ఇంక నువ్వు ఏ సినిమాకో వెళ్ళి ఉంటావనుకుని నేను క్లబ్బుకి బయల్దేరాను" అన్నాడతను.

ఇంక ఆ పైన విశాలావుకు ఏమీ కనిపించలేదు.

ఇతను ఆమె అసలు భర్తన్నమాట!

మరి ఇందాక సినిమాహాల్లో ఆమె పక్క కూర్చుని ఉన్నతను?

"నానాటి బ్రతుకు నాటకమూ..."

యమ్మెస్ సుబ్బలక్ష్మి గొంతు విశాలావు చెవుల్లో గింగురు మనసాగింది...

****

# మాన్ ఆఫ్ కాన్షెన్స్

**"అయామ్ ఎ మాన్ ఆఫ్ కాన్షెన్స్!"** అన్నాడు విష్ణుమూర్తి.

"ఎట్లా?"

"ఒకసారి నేను సిన్ చేయబోయి అంతరాత్మ కారణంగా ఆగిపోయాను."

"చెప్పు, చెప్పు!!"

విష్ణుమూర్తి రోజూ ఆఫీసుకు సిటీబస్సులో వెళ్ళి, సిటీబస్సులో ఇంటికి తిరిగివస్తుంటాడు. అతను ఉండే ఇల్లు సిటీ బస్సు ఆగే మెయిన్‌రోడ్డు స్థలానికి రెండు కిలోమీటర్ల దూరాన ఉంటుంది. అంటే అతను ఉదయానా, సాయంత్రానా, సిటీ బస్సు ఎక్కడానికి గానీ, దిగి ఇంటికి రావడానికి గానీ ఆ రెండుకిలోమీటర్ల దూరాన్ని నడవాల్సి వచ్చేదన్నమాట. ఆఫీసులో పని వత్తిడీ, బస్సు కిటకిటలో హోరాహోరీ పోరాటమూ, ఆ తర్వాత మళ్ళీ నడకా ఇవన్నీ కలిసి అతను ఇంటికి వచ్చేసరికి పూర్తిగా డీలాపడిపోయేవాడు. నీరసంతో మంచం మీద వాలిపోయేవాడు. తిరిగి అతను తేరుకునేసరికి ఓ గంట దాటేది.

ఇదంతా చూసీ చూసీ ఓ రోజు అతని భార్య అతనితో అన్నది.

"ఈ బాధలన్నీ ఏం పడతారు, ఓ స్కూటరు కొనుక్కోండీ!"

"డబ్బులు?"

"నా నగలున్నాయిగా, వాటినమ్ముదాము."

అతనిది మధ్యరకం ఉద్యోగం. డబ్బులు వెనకేయగల స్తోమతకాదు. బ్యాంకు బాలెన్సు కూడా ఏమంతగా లేదు. స్కూటరు గురించి ఊహించడమే అతనికి గగనం. అలాంటిది భార్య తన నగలను అమ్మి, ఆ డబ్బుతో స్కూటరు కొనుక్కోమనే సరికి అతను సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. "నిజంగా?" అన్నాడు నమ్మలేక.

"అవునండీ! నాకీ అలంకారాలు అవీ అంటే ఇష్టం వుండదు. ఇవి నా వొంటిమీద ఉండి ఒరగబెట్టేది ఏముంది? "మీరు సుఖంగానన్నా ఉంటారు."

ఆరోజు అతనికి భార్యమీద రెట్టింపు ప్రేమ పుట్టుకొచ్చింది.

ఆమె నగలు అమ్మగా వచ్చిన డబ్బుతో విష్ణుమూర్తి సుజుకీ బైక్ కొన్నాడు. అది వంద సీసీ మోటారు సైకిలు. నీలం రంగులో ముద్దుగా మెరుస్తోంది. దాన్ని నడుపుతున్నప్పుడు పెద్దగా చప్పుడు లేకుండా తూనీగమీద కూర్చుని హాయిగా గాలిలో దూసుకుపోతున్నట్లు ఉండేది.

మొదటిరోజు సుజుకీ మీద కూర్చుని ఆఫీసుకి వెళుతున్నప్పుడు అతనికి భార్య మీద ప్రేమ రెండింతల నుంచీ మూడింతలకు పెరిగింది. "ప్రియే చారుశీలే.." అంటూ కూనిరాగం తీశాడు.

కానీ ఆ చారుశీలా ప్రియురాలు భార్యాకాక మరొకామె రూపంలో రాస్తాలో తనకోసం ఎదురుచూస్తోందనీ, త్వరలో తనామె వలలో పడబోతున్నాడనీ అప్పటికి అతనికింకా తెలియదు.

విష్ణుమూర్తి రోజూ ఠంచనుగా ఒక నిర్ణీత సమయానికి ఆఫీసుకు బయలుదేరతాడు. మళ్ళా సాయంత్రం ఆఫీసు వదలగానే ఎటూపోకుండా నేరుగా ఇంటికి వచ్చేస్తాడు. అంటే సాయంత్రం కూడా అతనిలాగే నిర్ణీత సమయానికి ఇంటికి బయలుదేరుతాడన్నమాట. అదే అతని భార్య కొంప తీయబోయింది -

రోజూ అతను ఆఫీసుకు వెళ్ళే సమయానికి, తిరిగి వచ్చే సమయానికీ అదే రూట్‌లో స్పార్క్ మోపెడ్ మీద ఒక యువతి ప్రయాణం చేస్తుంటుంది. ఆమె పొట్టిగా ఉంటుంది. గుత్తంగా ఉంటుంది పర్సనాలిటీ.

ఒకరోజు గాగుల్స్ ధరిస్తుందామె. మరొకరోజు కూలింగ్లాసెస్ పెడుతుంది. తలమీద క్యాప్ వుంటుంది. కాప్‌నుంచీ కాళ్ళ చెప్పుల వరకూ ఆమె మాచింగ్ కలర్‌లో మిడిసి పడుతుంటుంది. ఒకోసారి తలనిండా ఇన్నిపూలు పెట్టుకుని కొట్టొచ్చేట్లు కనిపిస్తుంటుంది. మొత్తం మీద ఆమె మోపెడ్ మీద కూర్చుని రోడ్డు మీద ప్రయాణిస్తుంటే ఎవరైనా కానీ గభాల్న ఆమెవైపు చూడకుండా ఉండలేరు. అందుకు విష్ణుమూర్తి పెద్ద మినహాయింపూ కాదు.

విష్ణుమూర్తి మొదట్లో ఆమెను చూసీ చూడనట్లు దాటిపోయేవాడు కానీ అనుదినమూ ఉదయానా, సాయంత్రానా ఓ నిర్ణీత స్థలానా, ఓ నిర్ణీత సమయాన ఆమె మాటిమాటికీ ఎదురు పడుతోంటే అతను సహజమైన కుతూహలంతో ఆమెవైపు చూసేవాడు. ఆమె కూడా అతనివేపు అలాగే చూసేది. ఏ సంఘటన అయినా మాటిమాటికీ అనేకసార్లు జరిగితే దానికి మనం అలవాటు పడిపోతాం. విష్ణుమూర్తి కూడా ఆమెను చూడటానికి అలా అలవాటు పడిపోయాడంటే అది అతడి బలహీనతను సమర్థిస్తున్నట్లు కాదు...

క్రమేపీ వాళ్ళలా ఒకరికొకరు తటస్థపడటమూ, ఒకరినొకరు చూసుకోవటమూ శృతిమించింది. అతడు ఆమెకు దగ్గరగా రాగానే హారన్ నొక్కేవాడు. తర్వాతర్వాత అతడు హారన్ నొక్కగానే ఆమె కూడా హారను నొక్కేది.

తర్వాత?

అతను నవ్వేవాడు, ఆమె కూడా నవ్వేది.

ఆ తర్వాత??

"మీరు రోజూ ఇదే రూటున వస్తారా?" ఓ రోజు సుజుకి స్లో చేస్తూ అతనామెతో అన్నాడు.

"మా ఆఫీసు ఈ కాలనీలోనేనండీ" మర్నాడు సమాధానం చెప్పిందామె తనూ స్లో చేస్తూ.

అటు తర్వాత??

ఇద్దరూ వాహనాలు ఆపారు.

చిన్నగా నవ్వుకున్నారు.

చిలిపిగా మాట్లాడుకున్నారు.

సందర్భం, అర్థం పర్థం లేనిది ఆ సంభాషణ అంతా.

రెండు విభిన్నధ్రువాల మధ్య జరిగే సహజాతి సహజపరిమాణం -

ఇంకా తర్వాత???

సాయంత్రం అతను సుజుకీని వెనక్కు తిప్పి ఆమెతో పాటు పబ్లిక్‌గార్డెన్‌లోకి ప్రవేశించాడు.

మరో సాయంత్రం తన బండిని తెలిసిన షాపువద్ద వదిలేసి ఆమె వెనక మోపెడ్ మీద కూర్చుని ఇందిరా పార్కుకు వెళ్ళాడు.

అసలు ఆరోజు అతను మోపెడ్‌ని తను నడుపుతానన్నాడు. ఆమె - కాదు, తనే నడుపుతానని అన్నది. అతన్ని తన వెనక కూర్చోమంది. కూర్చున్న దగ్గరనుంచీ అతని మెదడులో ఓ చిలిపి ఆలోచన ప్రవేశించి అతన్ని ఊరికే ఇబ్బంది పెట్టసాగింది. అతడు దాన్ని ఆచరణలో పెట్టలేదు కానీ పార్కులోకి ప్రవేశించాక కూడా ఆ ఆలోచన గుర్తుకు వచ్చి తనలో తను నవ్వుకోసాగాడు.

"ఏమిటి నవ్వుతున్నారు?"

"ఏమీలేదు!"

"లేదు ఏదో ఉంది..."

ఈసారి అతను పైకే నవ్వాడు.

ఆమె అదేమిటో చెప్పమని మరీ పట్టు పట్టేసరికి చెప్పాడు.

ఆమె మోపెడ్‌ని నడుపుతూంటే వెనక కూర్చున్న అతనికి చేతులు ముందుకు చాచి బాలెన్సు కోసం ఆమెను పట్టుకు కూర్చోవాలనిపించిందట!

చేతులతో అభినయిస్తూ అతడు చెబుతూంటే ఆమె మొహం ఎర్రగా కందిపోయింది. ఆ వెంటనే "యూ బ్లడీ!! అంటూ పులిలా అతని మీదకు లంఘుంచింది.

అతను పడీపడీ నవ్వుతోంటే ఆమె పిడికిళ్ళు బిగించి అతణ్ణి గుద్దసాగింది.

అప్పటికి వాళ్ళొక పొదచాటున ఉన్నారు. నవ్వుతూ విష్ణుమూర్తి చటుక్కున ఆమెను పొదివి పట్టుకున్నాడు. కళ్ళలోకి చూస్తూ ఆమె పెదవులు మీదికి వంగాడు.

ఆ క్షణాన అతను నవ్వటం లేదు. ఆమె అతణ్ణి గుద్దటంలేదు. ప్రకృతే నిశ్శబ్దమయిపోయింది. అతని కౌగిలిలో ఆమె, ఆమె కళ్ళల్లో అతను, అంతటా నిశ్చలం - ఫ్రీజ్ అయిపోయిన దృశ్యం అది -

ఆ తర్వాత ఏమయింది?

ఇద్దరూ మనుషుల నుంచీ జంతువులలోకి మారారు. అతనికి భార్య ఉంది. ఆమెకూ భర్త ఉన్నాడు. అయినా ఇద్దరూ "సిన్" చేయాలనుకున్నారు. అందుకోసం ప్లాను వేశారు.

ఆ ఉదయం ఆమె తన ఇంటివద్ద మోపెడ్ వైరు ఒకటి తెంపేసి దాన్ని నడవకుండా చేసింది. ఈ వంకన ఆఫీసుకు ఆటోలో బయలుదేరింది. అతగాడు తన ఇంటివద్ద కాంప్‌కి వెళుతున్నానని చెప్పి ఒక ఎయిర్‌బాగ్ తీసుకుని సుజుకీ మీద బయలుదేరాడుబయలుదేరాడు. ఇద్దరూ "లిబర్టీ" వద్ద కలుసుకున్నారు. అక్కణ్ణించీ అతని సుజుకీ మీద "ద్వారకా" చేరుకున్నారు. చూడటానికి ప్రయాణం చేస్తున్న భార్యాభర్తల్లా ఉన్నారు! సుజికీని లోపల యార్డులో ఉన్న పార్కింగ్ స్థలంలో ఉంచి ఒక గది తీసుకున్నారు మూడో అంతస్తులో.

బాల్కనీలో నిలబడి ఉన్నారు ఇద్దరూ. ఒకరి అరచేతిలో ఒకరి అరచేయి. రెండు అరిచేతుల మధ్యా విద్యుత్తు - ఇంకొద్ది క్షణాలలో ఇద్దరూ "సిన్"కి సన్నద్ధం కాబోతున్నారు.

లోలోపల ఏదో తహ తహ ఆతృత, కాళ్ళలో వణుకు, కళ్ళలో కాంక్ష -

బాల్కనీలోంచి క్రిందకి చూస్తుంటే యార్డులో పార్కు చేయబడి ఉన్న వాహనాలు కనిపిస్తున్నాయి. వాటివేపు చూస్తూ ఆమె హఠాత్తుగా అంది -

"నీలం రంగులో మీ సుజుకీ ఎంత చూడముచ్చటగా వున్నదండీ!"

ఆ మాటలు వినగానే విష్ణుమూర్తి ఉలిక్కిపడ్డాడు. తనకా సుజుకీని కొని ఇచ్చిన భార్య గుర్తుకు వచ్చింది. తను బస్సులో వెళ్ళివస్తోంటే ఆమె చూసి భరించలేకపోవడం, తన నగలను అమ్మే ప్రయత్నాలు, అమ్మాక ఈ 'సుజుకీ'ని కొనిపెట్టటం, తను దాని మీద తిరుగుతుండటం, ఈ సుజుకీ ద్వారానే ఈమె పరిచయం కావటం, అవన్నీ గిర్రున కళ్ళముందు తిరిగాయి. వెంటనే వేళ్ళలో వణుకుడు నిల్చిపోయింది. రక్తంలో పరుగులు తగ్గిపోయాయి. అంతవరకూ అనుభవించిన తహ తహ మటుమాయమైపోయింది...

చటుక్కున అతను మెట్లవేపు పరుగు తీశాడు. రెండు మూడు మెట్లు చొప్పున దూకుతూ రొప్పుతూ రోజుతూ యార్డులోకి వచ్చాడు...

"తర్వాత??"

"ఆ తర్వాత నేనామెను మళ్ళీ కలవలేదు" విష్ణుమూర్తి అన్నాడు.

"ఇప్పుడు నేను రూటుమార్చి వేరేదారిలో ఆఫీసుకు వెళ్తున్నాను. మా ఆవిడను కూడా ఇంతకు ముందుకంటే ఎక్కువ ప్రేమగా చూసుకుంటున్నాను."

"మొత్తానికి నీలో అంతరాత్మ అనేది వున్నదంటావు?" వ్యంగ్యంగా అడిగాడు శ్రీపతి.

అవునన్నట్లు తల ఊపాడు విష్ణుమూర్తి

"మరి అంతకు ముందు ఆమెతో పరిచయాన్ని పెంపొందించుకుంటున్నప్పుడు ఆ అంతరాత్మ ఎటుపోయింది??"

విష్ణుమూర్తి సమాధానమివ్వలేదు. దూరానికి చూడసాగాడు.

# డాక్టరు కంటే దర్జీ మేలు

**ఆడవాళ్ళకు ఎప్పుడు ఏ జబ్బు చేస్తుందో** ఎప్పుడు ఏ వైద్యుడి అవసరం వస్తుందో తెలియదు!

అమలకు ఇప్పుడు అలాంటి జబ్బే చేసింది.

అమలకు కలవాళ్ళ అమ్మాయి. ఎప్పుడూ కలకల లాడుతుంటుంది. కళ కళగా ఉంటుంది. ఎవర్ని పడితే వాళ్ళను "బ్బెబ్బెబ్బే" అని వెక్కిరిస్తుంది. ఎవర్ని పడితే వారిని నువ్వెంత, నీ కతెంత అని ధిక్కరిస్తుంది. సరిలేరు నాకెవ్వరూ అంటుంది.

అంత గారాబం ఆమె.

పువ్వుల్లో పుట్టిందామె. పువ్వుల్లో పెరిగింది. కారుల్లో తిరిగింది. అంత అపురూపం ఆమె.

అంత అపురూపంగానూ ఆమెని కోమలరావుకిచ్చి పెళ్ళి చేసారు. అతను కూడా ఆమెను అంత జాగ్రత్తగానూ చూసుకుంటున్నాడు. ఆమెకు కోపం వస్తే అతని కళ్ళు ఎర్రగా అవుతాయి. ఆమెకు బాధ కలిగితే అతని కళ్ళవెంట నీళ్ళు వస్తాయి. ఆమె కాస్తదూరం నడిస్తే అతని కాళ్ళు నొప్పిపుడుతాయి.

ఆమె బుగ్గల్ని ముద్దు పెట్టుకునేటప్పుడు ఎక్కడ కందుతుందోనని బాధపడతాడతను. ఆమె పెదిమల్ని చప్పరించేటప్పుడు ఎక్కడ కందుతుందో అని అడుగుతాడతను. ఆమె వంటిని నిమిరేటప్పుడు ఆ వత్తిడి ఆమె వంట్లోని కండరాలు ఎక్కడ స్థానభ్రంశం పొందుతున్నాయోనని ఆదుర్దాపడతాడతను. ఆమె శరీరంతో పెనుగులాడేటప్పుడు ఆమె ఊపిరి ఎక్కడ ఆగిపోతుందోనని భయపడతాడతను .. అంతటి అపురూపం ఆమె భర్తకు కూడా!!

ఏమి అదృష్టం తల్లీనీది!

అలాంటి అమలకు అంత ఒకసారి పెద్ద జబ్బు చేసింది.

అసలామెకు జబ్బు ఎలా వచ్చిందంటే -

రోజు ఆమె తన స్నేహితురాల్ని చూడటానికి కారులో వెళ్ళింది. కారులో తిరిగి వచ్చింది.

వస్తూ రాగానే మంచం మీద వాలింది. అంతే ఇక ఆమె మంచం లేవలేక పోయింది. మంచం మీద మెలికలు తిరిగిపోయిందామె. "ఛీ! ఛీ!" అంటూ ఛీత్కారాలు చేసింది. "ఎందుకీ బ్రతుకు" అంటూ తెగ నిట్టూర్పులు విడిచింది.

కోమలరావుకు ఆమె నా పరిస్థితిలో చూడగానే భయమేసింది. బెంబేలెత్తిపోయాడు.

"ఏమైంది అమలా?" అన్నాడతను.

"నా బొంద అయిది" అందామె కోపంగా.

"ఎక్కడ నీ బాధ!" అన్నాడతను.

"నా బ్రతుకే ఒక బాధ!" అందామె విసుగ్గా.

కోమలరావు వెంటనే డాక్టరుకు కబురు చేసాడు.

డాక్టరు వచ్చాడు. ఆమెను పరీక్షించాడు.

"ఏమిటి డాక్టర్ సంగతి?" అన్నాడు కోమలరావు ఆందోళనగా.

"నువ్వు తండ్రివి కాబోతున్నావు" అన్నాడు డాక్టరు సన్నగా నవ్వుతూ, బట్టతల నిమురుకుంటూ.

"నిజమా?!"

ఎగిరి గంతేయలేదు గానీ అంత సంబరంగానూ అన్నాడు కోమలరావు.

డాక్టరు కళ్ళు నవ్వుతూ చూసాయి నిజమన్నట్లుగా.

అమల మాత్రం వాళ్ళిద్దరి వేపూ కోపంగా చూసింది.

ఆరోజు గడిచింది. మరో రోజు గడిచింది. అయినా అమల మంచం మీంచి లేవలేదు. ఆమె జబ్బు తగ్గలేదు.

అంటే తమ ఫామిలీ డాక్టర్ల డయాగ్నసిస్ తప్పయిందన్నమాట! మరామె జబ్బేమిటి? ఎంతగా చిక్కిపోతోంది సుకుమారి?! ఆమె కళ్ళలో ఎంత వేదన కనిపిస్తోంది?!

భరించలేక కోమలరావు నగరానికి విచ్చేసిన ప్రపంచ ప్రసిద్ధ డాక్టరు విలియమ్స్‌ని ఇంటికి పిలిపించాడు.

న.వి.ప్ర.ప్ర.డా. విలియమ్స్ ఆమెను శుభ్రంగా అన్ని పరీక్షలూ చేయించాడు. రిజల్టు రిపోర్టుల్ని ముందు వేసుకుని అరగంటపాటు బుర్రగోక్కున్నాడు. జ్ఞానోదయం అయినవాడిలా చటుక్కున తలవంచి ప్రిస్క్రిప్షన్ కాగితం మీద ఇంత పొడుగున ఇంగ్లీషులో ఏదో పేరును వ్రాసాడు.

'దిసీజ్ హర్ డిసీజ్ ఐసే" అన్నాడు

తన భార్యకు అంత పొడుగాటి పేరుగల జబ్బు వచ్చిందని తెలియగానే కోమలరావు కాళ్ళు గజగజ వణికాయి.

"డాక్టర్.. నా అమల నాకు దక్కుతుందా?" అన్నాడు ఆందోళనగా.

"భయపడకు, అలాంటిదేమీ ఉండదు" అన్నాడు న.వి.ప్ర.డా. విలియమ్స్ కోమలరావు బుజాన్ని తట్టుతూ.

దక్కకపోతే మరొళ్ళని పెళ్ళి చేసుకుందువులే, అన్నట్లుందాయన బుజం తట్టిన ధోరణి.

మరో రెండురోజులు గడిచాయి. అమల ఇంకా చిక్కి సగమైంది. ఆమె ఇక తనకు దక్కటం అనుమానమే అనిపించింది కోమలరావుకు. అప్పటికి నాలుగురోజులయింది ఆమెకా జబ్బు చేసి. ఆ నాలుగురోజులలోనూ ఆమె ఒక్క సెకండు పాటయినా కళ్ళు మూసిన పాపాన పోలేదు.

ఆమె కళ్ళు లోతుకు పోయాయి. చెంపలు పీక్కుపోయాయి. కాళ్ళూ చేతులూ సన్నగిల్లాయి. పిచ్చి చూపులు చూస్తోందామె. ముక్కుతోంది, మూలుగుతోంది. జీవితం పట్ల వైరాగ్యాన్ని తన నిట్టూర్పుల ద్వారా వ్యక్తం చేస్తోంది.

ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని చిన్నగా నిమురుతున్నాడు కోమలరావు. అతని కళ్ళవెంట ధారలుగా నీళ్ళు కారుతున్నాయి.

ఆమె మంచం చుట్టూ ఆమె తల్లి, తండ్రి ఇతర బంధువులూ గుమికూడి ఉన్నారు. అందరూ దాదాపు నిశ్శబ్దంగా ఏడుస్తున్నారు. అంతటి డార్లింగ్ ఆమె అందరికీ!

ఆమె పరిస్థితి ఇవాళో రేపో అన్నట్లుంది. పాపం ఆ మర్నాడే ఆమె పుట్టినరోజు!

ప్రతి పుట్టిన రోజునీ ఆమె మహా వైభవంగా జరుపుకుంటుంది. ఆహ్వానం లేకపోయినా ఆనాడు ఆమెను అభినందించటానికి చుట్టాలూ పక్కాలూ వచ్చిపోతారు. పాపం పిచ్చిపిల్ల, పుట్టినరోజు ఆమెకు గిట్టిన రోజు కాబోతుందా అని వాళ్ళంతా గుసగుసలాడుకుంటున్నారు.

అలాంటి సమయంలో ఆ ఇంట్లోకి ఆ ఇంటి ఆస్థాన దర్జీ అడుగు పెట్టాడు. వారంరోజుల క్రితం అమల ఆర్డరిచ్చిన లేటెస్టు ఫ్యాషన్ డ్రస్సును ఇవ్వటానికి వచ్చాడతను.

ఆ ఇంటి వాతావరణాన్ని చూడగానే అతని మనస్సు ఏదో కీడును శంకించింది.

"ఏం జరిగింది?" అన్నాడతను ఆదుర్దాగా.

దర్జీ తెచ్చిన డ్రస్సును చూడగానే అక్కడ ఉన్నవాళ్ళ కళ్ళు మళ్ళీ చెమర్చాయి.

"చూడు తల్లీ నువ్వు పుట్టిన రోజు కోసం ఆర్డరిచ్చిన డ్రస్సును మన మస్తాన్ కుట్టి తీసుకు వచ్చాడు చూడమ్మా!" అందా తల్లి ఆ డ్రస్సును అమలకు చూపించుతూ.

నీరసంగా ఆ డ్రస్సువేపు చూసింది అమల. బలహీనంగా ఉన్న చేతిని నెమ్మదిగా పైకి లేపి డ్రస్సును అటూఇటూ తిప్పి పరిశీలించింది. పెదవి విరిచింది.

"ఎందుకు, నా పాడెమీద పెట్టి కాల్చటానికా ఇది?" నీరసంగా అందామె. "మొన్న నేను చూసిన ఉష డ్రస్సుకంటే ఇదేమంత బాగుంది? దానికంటే లేటెస్టుది కాదాయె!"

కోమలరావు లేచి ఇవతలకి వచ్చాడు. దర్జీ మస్తాన్‌తో ఏదో మాట్లాడాడు.

"రేపటి దాకా ప్రాణాలు నిలుపుకో పిచ్చి తల్లీ," అనుకున్నాడు మస్తాన్ ఆ ఇంటి గుమ్మం దిగుతూ. మస్తాన్ వెంటనే ఉష వాళ్ళింటికి వెళ్ళాడు. ఆమె డ్రస్సును చూసాడు. తిరిగి రాగానే తన సహాయకుల్ని, అంటే అసిస్టెంటుల్ని కేకేసాడు.

"ఒరేయ్ ఈ రాత్రికి మీరంతా కష్టపడాలిరా!" అన్నాడతను.

ఆరాత్రి అతను తన కత్తెరకు పని చెబుతుండగా, అవతల ఇద్దరు రెండు మిషన్ల మీదా, కింద కూర్చుని మరో ముగ్గురు చేతి కుట్లతోనూ, అంతా కంటి మీద కునుకెరగకుండా తెల్లవారేదాకా కష్టపడి పనిచేసారు.

తెల్లవారింది.

ఇక అమలను మంచం దింపటం మంచిదనుకుంటున్నారు అందరూ...

అలాంటి సమయంలో దర్జీ మస్తాన్ ఆ ఇంట్లోకి అడుగు పెట్టాడు.

కోమలరావు తన భార్య చెవివద్ద నోరుంచి "చూడు అమలా. మన మస్తాన్ నీకోసం ఉష డ్రస్సుకంటే అద్భుతమైన డ్రస్సును కుట్టి తీసుకు వచ్చాడు చూడు!"

ఈలోకపు అంచుల్ని దాటబోతున్న అమల ప్రాణాలు ఆ మాటలు వినగానే చప్పున వెనక్కు తిరిగి వచ్చాయి.

కళ్ళు తెరిచిందామె.

భర్త ఆ డ్రస్సును విప్పదీసి అటు తిప్పీ ఇటు తిప్పీ చూపిస్తుంటే ఆమె కళ్ళు చటుక్కున మెరిశాయి.

అక్కడున్న వాళ్ళందరినీ అవతలకి వెళ్ళమని ఆ డ్రస్సును తనకు తొడగమందామె.

అందరూ అవతలికి వెళ్ళిపోయారు.

ఆమె వంటి మీద అంతకు ముందున్న దుస్తుల్ని వలిచి కోమలరావు ఈ కొత్త డ్రస్సును ఆమెకు తొడిగాడు.

నెమ్మదిగా లేపి కూర్చోబెట్టాడామెను.

నిలువెత్తు అద్దాన్ని తీసుకు వచ్చి ఆమె ముందుంచాడు.

అద్దంలో కొద్దిసేపు తన డ్రస్సును చూసుకుందామె.

"ఉష డ్రస్సుకంటే నా డ్రస్సే అద్భుతంగా ఉంది" అంది.

అద్దంలో చూసుకుంటున్న కొద్దీ నిదానంగా ఆమెలో మార్పులు కనిపించసాగాయి. మొదట ఆమె కళ్ళల్లోకి కళ వచ్చింది. తర్వాత శరీరంలోకి జవం, జీవం వచ్చాయి.

నీరసంగా మంచం మీద కూర్చున్న మనిషి కాస్తా ఛెంగున మంచం దిగింది. పూలతీగల్లాంటి తన చేతుల్ని భర్త మెడ చుట్టూ బిగించింది.

"డార్లింగ్ నువ్వెంత మంచివాడివి! ఇవాళే కదా నా పుట్టినరోజు, పద ఆ అరేంజ్‌మెంటు చూద్దాము! ఇప్పుడు ఉషవేపు నేను గర్వంగా చూడగలను!!" అన్నది.

"దాన్ని కూడా ఫంక్షనుకు పిల్చావు కదూ?" అన్నది మళ్ళీ.

తలుపు తెరుచుకుని చెంగు చెంగున గెంతుతూ వస్తున్న అమలను చూసి చుట్టాలూ, పక్కాలు, తల్లీ తండ్రీ అంతా ఆశ్చర్యంతో బిగుసుకుపోయారు!

ఆడవారి మనసులు అంత సున్నితంగా ఉంటాయి మరి...

# డెరెబ్రో

ఆ మధ్య నాకు బాగా జబ్బు చేసింది. చానాళ్ళపాటు పక్క మీంచి కదలలేదు. తీవ్రమయిన జ్వరం, ప్రేలాపనలు, హెలూసినేషన్స్‌తో పెద్ద హడావుడి, ఆందోళన, గందరగోళాలు చోటు చేసుకున్నాయి. అన్నాళ్ళూ ఇంటి వాతావరణంలో, స్వాస్థత చిక్కి నేను మళ్ళీ తిరగ గలిగే స్థితి వచ్చేసరికి మనుష్యుల్ని చూడాలనే తపన, లోకం పట్ల అపారమయిన ప్రేమ, మరో జన్మనెత్తిన అనుభూతి, ఈ లోకం తాలూకు అనుభవాలలోకి తలక్రిందులుగా డైవ్ చేయాలనే వెర్రి ఆరాటమూ ఆవహించి, ఉక్కిరి బిక్కిరి చేశాయి. అందుకే జ్వరం తాలూకు షివర్ ఇంకా మెదడులో సర్దుకోకముందే ఇటు తిరిగి, అటు తిరిగి, ఈ మిత్రుడిని ఆ మిత్రుణ్ణి కలిసి, ఈ సినిమాకు వెళ్ళి, ఆ సినిమాకు వెళ్ళీ నాకు నేను హడావుడిలో మునిగితేలాను. అనుభవాల పట్ల ఆశగా ఆబగా ఆవురావురమంటూ వెర్రిగా....

అదిగో అలాంటి రోజుల్లో జరిగాయి ఈ క్రింది సంఘటనలు –

ఆ రోజు రాత్రి బాగా పొద్దుపోయింది. టాంక్‌బండ్ సిమెంటు బెంచి మీద కూర్చుని ఉన్నాను.

కళ్ళకెదురుగా రెయిలింగ్ పొడుగ్గా చాచుకుని కనిపిస్తోంది. వెనక రోడ్డు మీద అంత రద్దీ లేదు కానీ వాహనాలు మాత్రం ఉండీ ఉడిగీ అటూ ఇటూ కదిలిపోతున్నాయి. ఒకళ్ళూ ఆరా జంటలు నడుం చుట్టూ చేతులు వేసి అవతలగా నడుస్తూనో రెయిలింగ్ నానుకుని నిలబడో కళ్ళ చివర్ల నుంచీ కనిపిస్తున్నారు. నగరమంతా విద్యుద్దీపాలతో చిక్కురు బొక్కురుగా చుక్కలు చుక్కలుగా కనిపిస్తోంది. మినుకు మినుకుమనే దీపాలతో కదులుతూ వస్తున్న విమానం ఒకటి కుడివైపు మూలగా భవనాల మధ్య నుంచీ క్రిందకి దిగటం కనిపిస్తోంది.

ఆ సమయాన నా పక్కనే ఎవరో కూర్చున్నట్లు అనిపించింది. నాక్కొంచెం చిరాకు వేసిన మాట నిజం. కోపంతో పక్కకు చూసి ఉలిక్కిపడ్డాను.

నా పక్కన కూర్చున్నది మనిషి కాదు.

తలలేని మొండెం!

ఇన్‌షర్టు చేసుకుని ఉంది ఆ మొండెం. మెడభాగంలోంచి నెత్తురు ఎర్రగా ఉబికి ఉబికి పైకి వస్తోంది. షర్టు మీద కాలరు వద్దనుంచీ కిందికి నెత్తురు చారికలు కనిపిస్తున్నాయి.

నా కాళ్ళలో చిన్నగా వణుకుడు మొదలైంది. అంతకుముందే ఎవరో తలను నరికేసినట్లుగా ఉంది వాలకం. నా పక్కన ఎవరు కూర్చోబెట్టారో అర్థం కాలేదు. పోలీసులు చూశారంటే నాకు తెలియని ఆరాలన్నింటినీ అడుగుతారు. చిక్కుల్లో ఇరుక్కోవడం కంటే అక్కడ్నించీ లేచి పారిపోవడం ఉత్తమం అనిపించింది.

మెల్లగా లేవబోతుంటే ఒక విచిత్రం జరిగింది!

ఆ మొండెం తాలూకు చేయి చిన్నగా లేచి నా కుడిచేతిని మణికట్టు గట్టిగా పట్టుకుంది.

"ఏం వెళతారు గానీ కూర్చోండి సార్"

నా గుండెలు క్షణం పాటు ఆగిపోయి మళ్ళీ బలహీనంగా కొట్టుకోసాగాయి.

ఎవరు మాట్లాడారా అని అటూ ఇటూ చూశాను. ఎవరూ లేరు.

"నేనే మాట్లాడుతున్నాను. కూర్చోండి సార్!" మళ్ళీ వినిపించిందా స్వరం.

ఏమాత్రం సందేహం లేదు, నా పక్క నున్న మొండెం వద్దనుంచే వస్తున్నాయా మాటలు. నోట్లో నీళ్ళు ఉంచుకుని మాట్లాడుతున్నట్లుగా గురగురా గుసగుస చప్పుడుతో. నేనో పెద్ద నాస్తికుడ్ని అనుకుంటాను నేను.

నమ్మశక్యం కాని విషయాలకు వీలయినంతలో రీజనింగ్ కోసం వెతకటానికి ప్రయత్నిస్తాను. నా ప్రక్కన కూర్చున్న తలలేని మొండెం కదిలి నా చేతిని పట్టుకోవటానికి గానీ, మాట్లాడటానికి గానీ ఎక్కడా రీజనింగ్ అందటం లేదు.

"నా చేతిని వదులు," అన్నాను నీరసంగా.

నా చేతిని వదిలేసిందా మొండెం.

అమ్మయ్య, ఒక్క ఉదుటున లేచి పారిపోదామా అనిపించింది. కానీ నా కాళ్ళలో సత్తువ నశించినట్లయింది. నేను నిస్సహాయుడ్ని,

"నాకు నా తల కావాలి సార్?" మళ్ళీ గురగురా వినిపించింది.

"ఎవరు నువ్వు?" అడిగాను బిక్క చచ్చిపోతూ.

ఆ మొండెం తాలూకు మనిషి పేరు సోమేశ్వరం అట, నాల్రోజుల క్రితం పెళ్ళిచేసుకున్నాడు. ఆ రాత్రి షికారుకని అతడిని ఇందిరా పార్కు వద్దకు తీసుకు వచ్చిన అతడి భార్య తన ప్రియుడితో కలిసి అతడి తలను నరికేసిందట. తలను తీసుకుపోయి వాళ్ళు వేరేచోట ఎక్కడో పారవేశారట.

"అప్పట్నుంచీ ఇలా నా తలకోసం తిరుగుతున్నాను. వాళ్ళ మీద ప్రతీకారం తీర్చుకోవాలి" అందా మొండెం కసిగా.

ఆ రోజు పేపర్లో చదివిన వార్త ఒకటి గుర్తొచ్చింది నాకు. ఆ ఉదయం జాగింగ్‌కని ఇందిరా పార్కువైపు వెళ్ళిన ఒక పెద్ద మనిషికి తలలేని మొండెం ఒకటి కనిపించిందట. అతడు వెనక్కు వెళ్ళి వేరే వాళ్ళను పిలుచుకు వచ్చేసరికి అక్కడ మొండెం కనిపించలేదట.

"అయితే ఆ మొండెం నువ్వేనన్నమాట?" అన్నాను స్వగతంలోలా

"ఆహా" గుర్రు గుర్రుమని వినిపించింది.

"అయితే ఇంతకీ నీకేం కావాలి?"

"ఒక తల కావాలి. వాళ్ళ మీద రివెంజ్ తీర్చుకుందామనుకుంటున్నాను. నా తల దొరికనా పరవాలేదు లేక మీ తల ఇచ్చినా ఫరవాలేదు. ..."

ఉలిక్కి పడ్డాను.

"నా తలేమిటి?" అన్నాను ఆందోళనగా.

మొండెం నా కుడి వేపున కూర్చుని ఉంది. అవతలి వైపున ఉన్న తన కుడిచేతిని చూపిందా మొండెం. ఆ చేతిలో పెద్ద ఛురిక ఉంది.

"తమరు ఒప్పుకుంటే ఈ కత్తితో మీ మెడమీద ఒక్క వేటు వేస్తాను. మీ తల క్రింద పడగానే నేను

అంటించుకుంటాను."

నాకు భయమేసి కొద్దిగా ఎడంగా జరిగాను. దగ్గరలో ఎవరన్నా ఉంటే బాగుండుననిపించింది. నా వెనక నుంచీ ఒకళ్ళిద్దరు నడుచుకుంటూ పోయారు కానీ, ఎవరూ నా పక్కన కూర్చున్న మొండాన్ని గమనించినట్లు లేరు.

ఏమిటి వాళ్ళకా మొండెం కనిపించటం లేదా? లేక తమ పనుల తొందరలో పట్టించుకోకుండా పోతున్నారా?

అర్థం కాలేదు నాకు.

అంతలో మొండెం లేచి నిలబడింది.

"నా తల ఎక్కడన్నా కనిపించితే తీసుకుని ఈ ప్రదేశానికి రండి. అలా చేయకపోయారంటే మాత్రం మీ తలను తీసేసుకోవాల్సి వస్తుంది" అన్నది.

అన్నాక ఆ మొండెం రెండడుగులు ముందుకు వేసి రెయిలింగ్ మీదకు ఎక్కి ఆ పక్క హుస్సేన్ సాగర్‌లోకి జారిపోయింది.

మొండెం కనిపించకుండా పోగానే నాకు పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది. అప్పటి వరకూ జరిగింది నా భ్రమో వాస్తవమో కూడా అర్థం కాలేదు.....

మర్నాడు కాక ఆ మర్నాడు, అంటే ఆ సంఘటన జరిగిన రెండురోజుల తర్వాత అమరావతి టాకీసులో కూర్చుని ఉన్నాను నేను. పాత హిందీ సినిమా అది. జనం అంతగా లేరు. చుట్టు పక్కల సీట్లలో ఎవరూ లేక నేను వంటరిగా కూర్చుని ఉన్నాను. అలాంటి వాతావరణం నాకు చాలా ఇష్టం. అమాయకంగా కనిపిస్తున్న హీరోయిన్ దిగులుగా ఏదో విరహ గీతాన్ని ఆలాపిస్తుంటే క్రమంగా నేనో నాస్టాల్జియాలోకి జారసాగాను.

అలాంటి సమయంలో హఠాత్తుగా నా పక్కనుంచీ "హలో" అంటూ వినిపించింది. అటూ ఇటూ చూశాను. నాకు దగ్గరలో ఎవరూ లేరు. నన్ను కాదనుకుని తెరమీదకు దృష్టి మళ్ళించబోతుండగా మళ్ళీ వినిపించింది.

"హలో, మిమ్మల్నే సార్!"

ఆ స్వరం నా పక్క సీట్లోంచీ వస్తోంది. అటువైపుకు చూడగానే దాదాపు దడుచుకున్నంత పనయింది.

ఆ సీట్లో ఒక తల.. మొండెం లేని తల.. కనిపిస్తోంది.

ఆ తలకు మెడ భాగాన్నుంచీ రక్తం విపరీతంగా ధారలు కట్టి నేలమీదకు కారుతోంది. ఆ తల తాలూకు కళ్ళు పూర్తిగా విచ్చుకుని నా వేపే చూస్తున్నాయి.

"ఏమిటి సార్ అంతగా లీనమై చూస్తున్నారు. సినిమా అంత బాగుందా?"

ఓరి నాయనోయ్....

నాకు మాట రాలేదు. ఆ తల మాట్లాడటమే గాక కళ్ళు విప్పార్చి నా వేపే చూస్తుండటంతో వళ్ళు గగుర్పొడిచింది.

"నన్ను నా మొండెం వద్దకు చేర్చరా?" మళ్ళీ అడిగిందా తల.

నాకు తల తిరిగినట్లయింది. చప్పున లేచి హాల్లోంచీ బయటకు నడిచాను.

జరుగుతున్న సంఘటనలు నాకేమీ కొరుకుడు పడటం లేదు. అంతకు ముందు రోజు మొండెం కనిపించటము, మళ్ళీ హాల్లో తల కనిపించటమూ భ్రమా, వాస్తవమా అన్నది నాకు అర్థం కావటం లేదు. వీలైనంత హేతు బద్ధంగా

ఉండటానికి ప్రయత్నిస్తాను నేను. అలాంటి నేను మానసికంగా బలహీనుణ్ణి అవుతున్నానా? ఇలా ఆలోచించుకుంటూ ఇంటికి నడుస్తున్నాను.

రాత్రి పది దాటింది అప్పటికి. నేనుంటున్న కాలనీకి వెళ్ళాలంటే ఆంధ్రా బ్యాంకుని దాటాక కుడి ప్రక్క గొందిలో కొంత దూరం నడవాలి. సామాన్యంగా ఆ ప్రదేశం ఆ సమయంలో  నిర్జనంగా ఉంటుంది. ఉపకార్ కిరాణా స్టోర్స్ దాకా వచ్చాను. అంతలో నా వెనక అడుగుల చప్పుడు వినిపించింది. వెనక్కు తిరిగి చూసి ఉలిక్కి పడ్డాను.

నా వెనకే తల లేని మొండెం నడుచుకుంటూ వస్తోంది.

అదే డ్రస్సు.

మెడ మీంచి నెత్తురు ఉబికి ఉబికి వస్తోంది.

నేను తన వేపు తిరగగానే మొండెం వేగంగా అడుగులు వేస్తూ నా పక్కకు వచ్చింది.

"నన్ను మోసం చేసావు కదూ?" అంది గురగురా.

"మోసమేమిటి?"

"నా తల కనిపించినా కూడా పట్టాలేదు నువ్వు. ఇది మోసం కాక మరేమిటి?"

మాట్లాడలేదు నేను. అంతవరకు సార్ అన్న మొండెం కాస్తా ఏకవచన సంబోధనలోకి దిగింది. ఇదేదో యమడేంజర్‌గా కనిపిస్తోంది, ఏదో ఒకటి చేయాలి. నేనిలా అనుకుంటుండగా మొండెం చేతిలో మళ్ళీ ఆ ఛురిక కనిపించింది.

"ఇక లాభం లేదు. నా తలను ఎటూ తెచ్చి ఇచ్చేట్టు లేవు - అందుకే నీ తల తీసుకుంటాను" అంటూ కత్తిని పైకెత్తింది. (క్షమించాలి, ఈ మొండాన్ని స్త్రీలింగంలో సంబోధించాలో పుంలింగంలో సంబోధించాలో నా కర్థం కావటం లేదు.)

కత్తి ఉన్న చేతిని పైకెత్తగానే నా ప్రాణాలు పైకే పోయాయి. వెర్రిగా అరవాలనుకున్నాను. గొంతు సహకరించలేదు. అదృష్టవశాత్తూ పక్కన ఉన్న గుడిసెల్లోంచీ ఇద్దరు మగవాళ్ళు బయటికి రావడంతో మొండెం ఒక్క పరుగున వెళ్ళి ఎదురుగా ఉన్న డ్రైనేజీ కిందకి అదృశ్యమైంది.

బ్రతుకు జీవుడా అనుకుంటూ నేను ఇంటికి జేరుకున్నాను.

ఈ తలలేని మొండెం నా వెనక ఎందుకు పడుతోందో నాకు అర్థం కాలేదు. నగరంలో ఇంతమంది ఉండగా నేనే దొరకాలా??

ఆ రాత్రి నాకు ఎంతకీ నిద్రపట్టలేదు. ఒంటిగంటకు గావును ఇక కునుకు పట్టేట్లు అనిపించింది. "ఒకటికి" వెళ్ళి వద్దామని బాత్‌రూమ్‌లోకి వెళ్ళి లైటు వేసాను. అంతే, కట్టెలా బిగుసుకుపోయాను...

ఏం చెప్పమంటారు,

సోప్ కేసుల్ని ఉంచే అరలో - వాటి స్థానంలో - మిడిగుడ్లేసుకుని నన్నే చూస్తోంది మొండెం లేని తల.

దాని మెడ కింద నుంచీ అంతకు ముందులాగానే రక్తం కారుతోంది. ఆ రక్తం చారికలు గోడమీంచి అలా క్రిందకి జారుతున్నాయి.

"మోసం చేస్తున్నావు కదూ మిత్రమా?"

ఆ సమయంలో నాకు భయం కంటే ఎక్కువ కోపమే కలిగింది.

"ఏమిటి మాటిమాటికీ మోసం మోసం అంటారు? నేను మీకెందుకు సహాయం చేయాలి? ఇంత విశాల నగరంలో ఇంత మందిని వదిలేసి నా ఒక్కడి వెనకపడి ఇలా వేధించటం ఏమీ బాలేదు. పైగా నీ మొండెం కత్తి తీసుకుని తల నరుకుతానంటూ నా వెనక పడటమేమిటి? ఇది మరీ దారుణం కాకపోతే..." అన్నాను గబగబా.

"ఆగు మిత్రమా, అంత ఆవేశపడవద్దు. నా బాధ కూడా అర్ధం చేసుకోవటానికి ప్రయత్నించు! నమ్మించి వంచించిన ఆడదాన్ని ముక్కలుగా నరకాలంటావా వద్దా? ముక్కూ మొహం తెలియని వాడు తన స్వార్ధకాపీనంతో నన్ను మొండాన్నుంచీ వేరు చేసినప్పుడు వాడి మీద ప్రతీకారం తీర్చుకోవాలంటావా వద్దా నువ్వే చెప్పు..."

"అదంతా బాగానే ఉంది. కానీ అందుకోసం నన్నెందుకు ఇలా ఏడిపించటం?" అన్నాను ఉక్రోషంగా.

"అట్లా కాదు, నిన్ను చూడగానే ఏదో జన్మజన్మల బంధం మన మధ్య ఉన్నట్లుగా అనిపించింది. ఇదిగో ఇతనే మనకు కావాల్సినవాడు, అనిపించింది. ఏదో అంటారే శంఖువులో పోస్తే తప్ప తీర్థం కాదని, అలా నీ చేయూతతోనే ఈ పనిని చేయగలమనిపించుతోంది!"

"ఏమిటంట, నాలో ఉన్న అంత ప్రత్యేకత...?"

"నీకు మట్టుకు తెలియదా! ఒకరికి అపకారం చేయని గుణం, నిష్కల్మత్వం, దేవుణ్ణి నమ్మకపోయినా పాపరాహిత్యం..."

సిగ్గేసింది నాకు. ఇలాంటి గుణాలు నాలో ఉన్నాయని నేను లోలోపల అనుకుంటుంటాను. (ఏమీ చేయలేని వెధవాయలంతా ఇలానే అనుకుంటారు....)

"అయితే ఏం చేయమంటావు నన్ను?" అన్నాను ఆ ఫ్లాటరీకి పొంగిపోయి -

"నన్ను నా మొండానికి అతికించు."

లోపలికి పోయి ఒక పెద్ద పోలథీన్ బాగ్‌ని తీసుకు వచ్చాను. ఆ తలను తీసుకుని భద్రంగా అందులో ఉంచి రోడ్డు మీదకి నడిచాను.

వీధంతా నిర్మానుష్యంగా ఉంది. డ్రైనేజీ వంతెన వద్దకు వచ్చేసరికి మొండెం కనిపించ వచ్చునేమో అనుకున్నాను గానీ కనిపించలేదు. ఉపకార్ షాపు వద్దకు వచ్చేసరికి సడన్‌గా నా ప్రక్కన నడుస్తూ మొండెం కనిపించింది.

"థ్యాంక్యూ మిత్రమా," అంది మొండెం గురగురా. "తలను అంటించగానే ఇక నా వేపు చూడకుండా వెనక్కు తిరిగి వెళ్ళిపో."

"చేస్తాను గానీ, మళ్ళీ నా జోలికి రావు కదూ..."

"అమ్మ ఇంత సహాయం చేసినందుకు కృతజ్ఞత చూపాలి గానీ అపకారం చేస్తానా?"

"కృతజ్ఞత చెప్పటానికైనా గానీ మళ్ళీ నావద్దకు రాకూడదు."

"సరే సరే," గురగురా నవ్విన చప్పుడు వినిపించింది.

తలను జాగ్రత్తగా పైకి తీసి మొండెం మీద సరైన స్థానంలో ఉంచి ఇక అటువేపైనా చూడకుండా వెనక్కు తిరిగి ఇంటివేపు పరుగు తీసాను...

ఇది జరిగి చానాళ్ళయింది. ఆ తర్వాత నాకు మొండెం గానీ తలగానీ మళ్ళీ కనిపించలేదు. అయితే నాకు ఇప్పటికీ ఒక సందేహం పీకుతుంటుంది ఆ సంఘటనలు నిజంగానే జరిగినవా లేక నా భ్రమలా? చిన్నప్పుడు నేను ఈ

లోకమంతా నాకోసమే సృజించబడిందనీ, నేను కారణ జన్ముడననీ, నా మిత్రులంతా దేవతలనీ నా శత్రువులంతా రాక్షసులనీ, నాతో ఆడుకునే ఆడపిల్లలంతా, పూర్వజన్మలో గోపికలనీ, నేను గోపికాలోలుడననీ ఇలా ఏవేవో వెర్రి మొర్రి ఊహలలో బ్రతికేవాణ్ణి. అదంతా డిల్యూజన్ ఆఫ్ గ్రాండెర్ (Delusion of grandeur)....తర్వాత తర్వాత ఆ భ్రమలన్నీ మనస్సు పొరలలోకి జారుకుని ప్రాక్టికల్ ఆలోచనలోకి మళ్ళాను. అయితే జ్వరం తాలూకు బలహీనతలో పూర్వపు డెల్యూజన్ ఆఫ్ గ్రాండెర్ బయటికి వచ్చి నాలో హెలూసినేషన్స్‌ని సృష్టించి పెట్టిందా?? ఎందుకంటే అలాంటి దాఖలాలు కొన్ని అక్కడక్కడా సంభాషణల్లో కనిపించుతున్నాయి. ముఖ్యంగా ఆఖర్లో మా బాత్‌రూమ్‌లో నేను తలతో మాట్లాడిన సంభాషణల్లో...

అయితే నా ఈ ఎనాలిసిస్‌ని కుంటుపరిచే ఒక సంఘటన జరిగింది ఆ తర్వాత. అదేమిటంటే –

ఆ రాత్రి నేను తలను మొండానికి అతికించాననుకుంటున్న మర్నాటి ఉదయం పేపర్లో ఒక వార్త వచ్చింది. ఆ తెల్లవారు ఝామున హుస్సేన్ సాగర్ ఒడ్డున తలలు నరకబడ్డ ఇద్దరు స్త్రీ పురుషుల దేహాలు కనిపించాయట, ఆ రెండు హత్యలూ అక్రమ సంబంధం మూలంగా జరిగాయని భావించబడుతోంది అంటూ ఉందా వార్తలో.

ఆ వార్త చదవగానే నా మెదడు మొద్దుబారిపోయింది.

# వానిటీ పర్‌ప్లెక్స్‌డ్



నిలువుటద్దం ముందు కూర్చుని ఉందామె. బ్యూటీ క్రీమ్ ట్యూబును చేతిలోకి తీసుకుంది. వొత్తింది దాన్ని, బయటికి వచ్చిన క్రీమును చుక్కలు చుక్కలుగా చెంపలమీదా ముక్కు మీదా గడ్డం మీదా, నుదురు మీదా మెడమీదా అక్కడా ఇక్కడా, ఇక్కడా అక్కడా అద్దింది. అరిచేతుల్తో ఆ చుక్కల్ని మర్దన చేసినట్లుగా మొహం నిండానూ ఇటూ అటూ తెగ పామింది. కళ్ళ ఈ చివర్ల నుంచీ ఒకసారీ, కళ్ళ ఆ చివర్ల నుంచీ ఒకసారీ అద్దంలో మొహాన్ని అటూ ఇటూ చూసుకుంది.

ముదురుతనం పోయి మొహంలోకి కొద్దిగానన్నా మృదుత్వం చోటు చేసుకుందా? నా సామిరంగా చేసుకుంది చేసుకుంది.....

కొద్దిగా తృప్తిపడిందామె.

తర్వాత ఆమె సువాసనలు వెదజల్లుతున్న పౌడరును చేతిలోకి తీసుకుంది. తేలిపోతున్న ఆ సువాసనని మొహం మీది క్రీము మీద దట్టంగా పట్టించింది.

ఇంక మిగిలింది కాటుక! దాన్నీ చేతిలోకి తీసుకుంది. కనురెప్పల మీద సన్నగా అలా అలా వంపులు తిప్పింది నల్లగా.

మళ్ళా అద్దంలో మొహాన్ని చూసుకుంది. మెడను అటు తిప్పింది ఇటు తిప్పింది. తలను పైకి చాచింది, క్రిందకి దించింది.

తర్వాత లేచి నిలబడింది.

పొడుగ్గా ఉందామె. అందుకు తగ్గలావుగానూ ఉంది. నలభై ఏళ్ళ పైనే ఉంటాయి. కాని ఇరవై ఏళ్ళ నవయవ్వనవతిలా కనిపించాలన్న తాపత్రయం ఉంది. వీలయితే పాపాయిలానూ కనిపించాలని ఉంది. కానీ మోచేతులూ, పొట్ట పక్కల నుంచీ, కళ్ళ కిందనుంచీ పటుత్వం పోయిన సూచనలు కనిపిస్తున్నాయి. పిరుదల మీంచి వయస్సు నేనున్నాను నేనున్నానంటూ తొంగి పలకరిస్తోంది.

తర్వాత ఆమె ఝుమఝుమాయించే మాంచి అందమైన పాము కుబుసపు చీరను వంటికి చుట్టుకుంది. స్లీవ్‌లెస్ జాకెట్‌ను వేసుకుంది. ఆఖరుగా అద్దం ముందు ఇటునుంచీ అటూ అటు నుంచీ ఇటూ తిరిగి సోకును పరీక్షించుకుంది.

కదలబోతూ కదలబోతూ కుడిచేత్తో కుచ్చిళ్ళు బొడ్డు కిందికి ఉందీ లేనిదీ తడిమి చూసుకుంది...

తలుపు తెరిచాడు రచయిత.

"నా పేరు సుందరి," అందామె.

సుందరమ్మ అనండి అనుకున్నాడతను. రండి లోపలికి అన్నాడు.

లోపలికి నడిచిందామె. నడుస్తుంటే చీరలోపల ఆమె కాళ్ళు వణకసాగాయి. గదిచుట్టూ కూలింగ్ గ్లాసులు. సోఫాలలో మెత్తటి మెత్తలు.

"కూర్చోండి" అన్నాడతను.

కూర్చుందామె

అతని మొహంలోకి చూడసాగింది. చిన్నవాడు. చక్కగా ఉన్నవాడు. మొహంలో అమ్మాయితనం. గొంతులోనూ అమ్మాయితనమే. నవ్వుతున్నాడు సన్నగా.

"చెప్పండి!" అన్నాడు.

చెప్పటానికి ఆమెకు ఏమీ కనిపించలేదు. ఏమీ చెప్పలేదామె. అలా గుడ్లప్పగించి అతని మొహంలోకి చూడసాగింది. రచయితగా అతను కూడా ఆమె మొహం వేపు పరిశీలనగా చూశాడు. ఏదో అసంతృప్తికి లోనవుతున్న మనిషిలా కనిపించిందామె. బడాయికి పోయే మనిషిలా కనిపించింది. పిల్లల తల్లిలా కనిపించింది. తను చాలా డిజైరబుల్ మనిషి అని అవతలివాళ్ళు భావించాలనే తపన గల స్త్రీలా కనిపించింది. సంప్రదాయిక స్త్రీలా కనిపించింది. ఆ సంప్రదాయాలకి, వ్యక్తిగత వాంఛలకీ లంగరందని స్త్రీలా కనిపించింది.

"మాట్లాడరేమిటండీ" అన్నాడతను.

"అబ్బే ఏమీ లేదు" అందామె.

అని, అతని మొహంలోకి చూడసాగింది. ఆ ప్రశాంత వాతావరణంలో, ఆ వంటరితనంలో, ఆ నిశ్శబ్దంలో, పేరు ప్రఖ్యాతలున్న ఆ వ్యక్తి ఎదుట, ఆమెకు ఎందుకో పిల్లలు, భర్త గుర్తుకు వచ్చారు. చిరాకు కలిగింది. సడన్‌గా ఆమె మనసులో నిరాశలాంటిది అవతరించింది.

దిగులులాంటిది కలిగింది. దుఃఖంలాంటిది కదిలింది. అవన్నీ కలిసి ముద్దముద్దగా గొంతులోంచి పైకి ఉబకసాగాయి.

"నాకు మీరు కలల్లోకి వస్తున్నారు" అంటూ ఆమె తనకు ఉత్తరాలలో రాయటం గుర్తుకు వచ్చిందతనికి. ఒక చిలిపి ఆలోచన ప్రవేశించింది అతనిలో.

ముందుకు వంగి సోఫా చేతి మీద ఉన్న ఆమె చేతి మణికట్టు మీద తన అరచేతిని వేసి చిన్నగా నిమిరాడు. ఆమె చేయి వణికింది. చేతిని అక్కడినుంచీ తీసివేయాలన్నట్లుగా కదిలించింది గానీ మళ్ళీ అట్లాగే ఉంచేసింది.

ఎందుకో ఆమెకు జీవితంలో శూన్యం గుర్తుకు వచ్చింది. ఏడుపు ముంచుకు వచ్చింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెక్కి వెక్కి ఏడవసాగింది. రచయితగా నానా విధాల స్త్రీలను స్టడీ చేయటం అతనికి అవసరం. హాబీ కూడా.

కొనగోటితో ఆమె కన్నీళ్ళను తుడిచాడతను. ఆమె వీపు మీద చేయి వేసి నిమిరాడు. నిగారింపు జారిపోయి మృదుత్వం మితిమీరి మెత్తగా తగులుతోందామె దేహం., అతని చేయి మెడమీదకి జరిగి అక్కడి నుంచీ క్రిందకి జారబోయేసరికి తృళ్ళిపడ్డట్లుగా ఆమె అతణ్ణి విదిల్చి అవలికి జరిగింది. "ఛీఛీ మీరు ఇట్లాంటివాళ్ళని అనుకోలేదు." అంది.

కొద్దిగా వెనక్కు జరిగి ఆమె కళ్ళలోకి సూటిగా చూసాడతను.

"చూడండీ," అతనన్నాడు - "మీకసలు ఏమి కావాలో మీకు తెలుసా? అసలా ప్రశ్నను ఎన్నడన్నా మీరు వేసుకున్నారా? ప్రతిమనిషికీ జీవితం ఎంతో ఆశాభంగాన్ని అందిస్తుంది. మనకసలు ఏమి కావాలో ముందు నిర్ధారించుకుని తర్వాత మనకున్న పరిధిలో దాన్ని సాధించటానికి ప్రయత్నించటము, సాధించలేని దానితో సరిపెట్టుకోవటమూ వివేకవంతుల లక్షణం. మీకు భర్త ఉన్నాడు. పిల్లలు ఉన్నారు. అయినా జీవితంలో మీకేదో లోటు కనిపిస్తోంది. ఆ మాత్రం లోటు నేటి సమాజంలో నేటి పరిస్థితుల్లో ప్రతి స్త్రీకి, ప్రతి పురుషుడికి ఎంతో కొంత తప్పనిసరి. ఆలోటును పూడ్చుకోవటం కోసమే సినిమాలకు ఎగబడటమూ నానా చెత్త సాహిత్యాన్నంతా చెత్తచెత్తగా చదివేయటమూ జరుగుతుంది. అది అంతటితో ఆగిపోవటం ఉత్తమలక్షణం. అంతటితో ఆగక రచయితల వద్దకో నటీనటుల వద్దకో వెళ్ళి వాళ్ళతో తాదాత్మ్యం చెందాలనుకోవటం అధమ లక్షణం. మేమూ మనుషులమే. మాలోనూ లోటు పాటులుంటాయి. మాతోపాటు కొన్నాళ్ళు జీవిస్తే అవేమిటో తెలుస్తాయి. లేకపోతే మా సంసారిణులనడిగినా తెలుస్తాయి. ఇలా అంటున్నానంటే ఇందాక మీమీద వాంఛతో నేను చెయ్యి వేశానని కాదు. మమ్మల్నీ ఫ్లెష్ అండ్ బ్లడ్ ఉన్న మామూలు మనుష్యులులా చూడాలి గానీ ఏదో సూపర్ మానవుల్లా చూడటం పరిపక్వతలేని వాళ్ళ లక్షణం. మిగతా మనుష్యుల్లో ఉండే బలహీనతలనీ వాళ్ళ జీవితాల్లో ఉండే అసంతృప్తుల్నీ ఆసరాగా ఫాంటసీలను సృష్టించి మేము కాష్ చేసుకుంటున్నాము. దీనిని మీబోటి ఫికిల్ మైండెడ్ పాఠకురాళ్ళంతా గ్రహించితే మంచిది.

ఇకపోతే మీ సంగతి - మీ అంతరాంతరాల్లో సంసారాన్నుంచీ ట్రాన్స్‌గ్రెస్ చేయాలన్న కోరికా ఉంది, సంసారం అందించే కూజీనెస్, సెక్యూరిటీ, వానిటీ, మొదలైన వాటిపట్ల మోహమూ ఉంది. అవునంటారా? కాదంటారా. .. "

కొద్ది సేపు ఆగి ఆమె మొహంలోకి చూసాడతను. ఆమె అలా కళ్ళప్పగించి చూస్తోందతనివేపు.

అంతలో మళ్ళీ మొదలుపెట్టాడతను.

"పాపం ఆ స్పష్టత మీకే తెలియదు. మీకు కావాల్సిందేమిటో తెలియక, మీరు వదులుకోవాల్సిందేమిటో తెలియక కన్‌ఫ్యూజన్‌లో నలిగిపోతున్నారు. పోనీ నన్ను చెప్పమంటారా మీకు కావాల్సిందేమిటో... మీకు భర్త కావాలి. పిల్లలు కావాలి. సంసారం కావాలి. ఫలనా ప్రఖ్యాత రచయితకు మీరు ఆరాధ్యురాలనో అతను మీకు ఆరాధ్యుడనో వానిటీ కూడా కావాలి. "

లేచి నిలబడ్డాడతను.

"జీవితంలో అంత దూరం నడిచిన మీరే ఇంతటి భ్రమల్లో ఉంటే యవ్వనపు అపరిపక్వ దశలో ఉండే మీ కూతుళ్ళు ఇంకెన్ని భ్రమల్లో ఉంటారో ఆలోచించండి..."

గుమ్మం వేపు అడుగులు వేసాడతను.

తడబడుతున్న అడుగులతో ఆమెకూడా అతని వెనక నడిచింది.

ఆమె భుజం మీద చేయివేసి చిన్నగా నొక్కి వదిలాడు.

"గుడ్‌బై!" అన్నాడు.